

కరీంనగర్ వార్త

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

బుధవారం 28, అక్టోబర్ 2026 16 పేజీలు

నవంబర్ 5న మహా ర్యాలీ



3లో



చామనపల్లి భూసేకరణ, పునరావాస ప్రక్రియ పూర్తి

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కలెక్టర్ కోయ శ్రీహర్ష.. 8 బృందాలతో 7 రోజుల్లో సామాజిక ప్రభావ అంచనా సర్వే

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త: చామనపల్లి గ్రామ ముంపు సమస్యను పరిష్కరించేందుకు గ్రామం మొత్తానికి భూసేకరణ చేసి, అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం, పునరావాసం కల్పిస్తామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. మంగళవారం ధర్మారం మండలం చామనపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ, భారీ వర్షాలు, నీటిని ఎత్తిపోసే సందర్భాల్లో గ్రామం ముంపునకు గురవు తోందని తెలిపారు.

2లో







వేలంపాటలో ఒక రేటు.. మిల్లుకు చేరాక మరో రేటు..
దళిత చైర్ పర్సన్ కావడంతో... లెక్క చేయడం లేదు..
మంగళవారం.. కొనుగోళ్లకు మొరయించిన వ్యాపారులు..

కాటన్ మార్కెట్‌లో.. అంత దగా.. దగా..

దండా

2లో

జమ్మికుంట, హుజూరాబాద్, ప్రభాతవార్త: బులియన్ మార్కెట్‌లో పచ్చబంగారం ధరలు పరుగులు తీస్తుండగా.. రైతన్నలు ఆరుగాలం కష్టించి, పండించిన తెల్లబంగారం పసిడితో పోటీ పడుతూ ఇప్పటికే క్వింటాల్‌కు 9250 రూపాయలు ధర పలికి ప్రైవేట్ వ్యాపారులు కొనుగోళ్లు చేయడంతో.. కొనుగోళ్లకు ముందుకు వచ్చిన కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) అధికారులు వెనుకడుగు వేసారు. ఎంఎస్‌పి ధర క్వింటాల్‌కు 8667 రూపాయల కంటే ఎక్కువ రైతులకు లభిస్తుండడంతో సిసిఐ అధికారులు కొనుగోలు కేంద్రాలను ప్రారంబించలేదు. జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో కాటన్ వ్యాపారులు అంతర్జాతీయ మార్కెట్‌లో కాటన్ కండీకి, గింజలకు మంచి ధర ఉండడంతో పోటీపడి 10 రోజుల పాటు కొనుగోలు చేసారు. దీనితో రైతులను మంచి ధరలు చూపించి, ఊరించి.. ఉడికించి.. ఆశల పల్లకిలో వారం రోజుల పాటు ఊరేగించి మార్కెట్‌కు రప్పించారు.

పదిహేను డిగ్రీలకు పడిపోతున్న ఉష్ణోగ్రతలు
చలిగాలులతో పెరుగుతున్న అనారోగ్య ముప్పు



చలి పంజా... రక్షణ ఉందా!?

2లో



రక్తదానం మానవతకు ప్రతీక

3లో

కరీంనగర్
క్రైమ్, ప్రభాతవార్త: రక్తదానం మరొకరి ప్రాణాన్ని కాపాడే మహోన్నత సేవ అని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కరీంనగర్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన మాట్లాడారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

అమరవీరుల స్ఫూర్తితో పోలీసుల రక్తదాన శిబిరం ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలి సీపీ గౌష్ ఆలం

నైనీ బొగ్గు బ్లాక్
అభివృద్ధికి భూసేకరణ కీలకం

40 నిర్వాసిత కుటుంబాలకు పునరావాస కాలనీ నిర్మాణానికి స్థలం కోరిన సింగరేణి సీఎండీ

గోదావరిఖని, ప్రభాతవార్త: ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్ అభివృద్ధి, బొగ్గు రవాణా మెలిక సదుపాయాల కల్పన, నిర్వాసితుల పునరావాసం కోసం అవసరమైన భూసేకరణపై సింగరేణి యాజమాన్యం దృష్టి సారించింది. ఈ ప్రాజెక్టులకు అవసరమైన స్థలాల కేటాయింపు, అనుమతుల మంజూరులో సహకరించాలని సంస్థ సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి అంగూల్ జిల్లా కలెక్టర్ మహ్మద్ అబ్దుల్ అక్తార్‌ను కోరారు. మంగళవారం జరిగిన సమావేశంలో నైనీ బ్లాక్‌కు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. సింగరేణికి పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

పునరావాసంపై నిర్ణయాల కోసం

నైనీ బొగ్గు గని వల్ల ప్రభావితమైన 40 కుటుంబాల కోసం పునరావాస, పునఃస్థాపన కాలనీ నిర్మాణానికి స్థలం కేటాయించాలని సీఎండీ విజ్ఞప్తి చేశారు. పునరావాస ప్యాకేజీల అమలు, భూసేకరణ, కాలనీ నిర్మాణంపై నిర్ణయాలు తీసుకునేందుకు సంబంధిత సలహా కమిటీ సమావేశాన్ని త్వరగా నిర్వహించాలని కోరారు. నైనీ గనికి అనుబంధంగా థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేయాలని సింగరేణి ప్రతిపాదిస్తోంది. ఇందుకోసం తుకుడా, జరపడా గ్రామాల పరిధిలో గుర్తించిన స్థలాన్ని సేకరించేందుకు సహకరించాలని కలెక్టర్‌ను కోరింది.

బొగ్గు రవాణాకు ప్రత్యామ్నాయ మార్గాలు

నైనీ గని నుంచి ఉత్పత్తి అవుతున్న బొగ్గును జరపడా రైల్వే జంక్షన్‌కు తరలించేందుకు చండీపడా–జరపడా గ్రామాల మధ్య బైపాస్ రహదారి నిర్మాణానికి సింగరేణి ఇప్పటికే రూ.35 కోట్లు డిపాజిట్ చేసింది. ఈ మార్గం పూర్తయితే ఇతర బొగ్గు ఉత్పత్తి పరిశ్రమలకూ రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని సంస్థ తెలిపింది. స్థానిక గ్రామాల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మాయికా బైపాస్ రహదారి నిర్మాణానికి కూడా సహకరించాలని కోరింది. అవసరమైన భూసేకరణ నిధులు సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించింది.

గ్యాసిఫికేషన్ అవకాశాలపై అధ్యయనం

ఒడిశాలో కార్యకలాపాల విస్తరణలో భాగంగా సంస్థ కార్యాలయం, ఉద్యోగుల నివాస కాలనీ నిర్మాణానికి స్థలం కేటాయించాలని సింగరేణి కోరింది. అనంతరం సీఎండీ నేతృత్వంలోని అధికారుల బృందం అంగూల్‌లో జిందాల్ సంస్థ ఏర్పాటు చేసిన కోల్ గ్యాసిఫికేషన్ ప్లాంట్‌ను సందర్శించింది. దేశీయ బొగ్గు నుంచి గ్యాస్ ఉత్పత్తి చేసి ఉక్కు పరిశ్రమలో వినియోగిస్తున్న విధానాన్ని పరిశీలించింది. సింగరేణిలో మూతపడిన భూగర్భ గనుల బొగ్గుతో గ్యాసిఫికేషన్ చేపట్టే అవకాశాలు, సాంకేతిక సాధ్యసాధ్యాలు, కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహకాలపై నిపుణులతో చర్చించింది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు గౌతమ్ పోట్రు, ఎల్.వి. సూర్యనారాయణ, ఈడీ బి. వెంకన్న, జీఎం టి. శ్రీనివాస్, నైనీ గని జీఎం భైద్య తదితరులు పాల్గొన్నారు.



చలి పంజా... రక్షణ ఉందా!?

పదిహేను డిగ్రీలకు పడిపోతున్న ఉష్ణోగ్రతలు
చలిగాలులతో పెరుగుతున్న అనారోగ్య ముప్పు
వేడి కోసం చేసే పొరపాట్లతో పొంచి ఉన్న ప్రమాదం
జాగ్రత్తలు పాటిస్తే చలి నుంచి ఉపశమనం

కరీంనగర్ హెల్త్, ప్రభాతవార్త: మొన్నటి వరకు వేడిగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా రాత్రి వేళలో చల్లబడుతోంది. చలికాలం అంటేనే సాధారణంగా తక్కువ వేడి ఎక్కువ చలి ఉంటుంది. రోజుకు కొంచెం కొంచెం పెరిగిన చలి పంజా విసురుతోంది. రాత్రిపూట ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుతుండటంతో ప్రజలు గజగజ వణుకుతున్నారు.

పదిహేను డిగ్రీలకు పడిపోతున్న ఉష్ణోగ్రతలు....

రాత్రిపూట ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల కంటే తక్కువగా ఉంటుంది. రాబోయే రోజులలో ఉష్ణోగ్రతలు అంతకంటే కూడా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలుపుతున్నారు. ముఖ్యంగా తెల్లవారుజామున, రాత్రి వేళల్లో చలిగాలుల ప్రభావం ఎక్కువగా ఉండటంతో సాధారణ జనజీవనంపై ప్రభావం పడుతోంది. చలికాలం తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే అనారోగ్య సమస్యలు చుట్టుముట్టే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే శ్వాసకోశ సమస్యలు, ఆస్తమా, గుండె జబ్బులు, రక్తపోటు, మధుమేహంతో బాధపడేవారు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు చలి ప్రభావానికి త్వరగా గురయ్యే అవకాశం ఉంది.

చలిగాలులతో పెరుగుతున్న అనారోగ్య ముప్పు....

ఉష్ణోగ్రతలు తగ్గినప్పుడు శరీరం తన ఉష్ణోగ్రతను నిలబెట్టుకోవడానికి అదనపు శ్రమ చేయాల్సి వస్తుంది. చల్లని గాలికి ఎక్కువసేపు గురికావడం వల్ల జలుబు, దగ్గు, గొంతునొప్పి, ముక్కు కారడం వంటి సమస్యలు ఎదురవుతాయి. చలికాలంలో వైరల్ శ్వాసకోశ ఇన్ఫెక్షన్ లు కూడా వ్యాపించే అవకాశం ఉంది. ఆస్తమా, దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడే వారిలో దగ్గు, ఆయాసం పెరగవచ్చు. చలి కారణంగా రక్తనాళాలు కుంచించుకుపోవడంతో రక్తపోటు పెరిగే అవకాశం ఉండటంతో గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. చిన్నపిల్లలు, ముఖ్యంగా నవజాత శిశువులు, తమ శరీర ఉష్ణోగ్రతను సరిగ్గా నియంత్రించుకోలేరు. వృద్ధుల్లోనూ శరీర ఉష్ణోగ్రతను నిలబెట్టుకునే సామర్థం తగ్గే అవకాశం ఉంటుంది. దీంతో వీరు చలికి ఎక్కువగా ప్రభావితమవుతారు. చిన్నారులకు తగినంత వెచ్చని దుస్తులు వేయడంతో పాటు తల, పాదాలు కప్పి ఉంచాలి. వృద్ధులు తెల్లవారుజామున, రాత్రివేళల్లో అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకపోవడం మంచిది. ఒంటరిగా నివసించే వృద్ధుల ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులు, ఇరుగుపొరుగువారు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి.

వేడి కోసం చేసే పొరపాట్లతో ప్రమాదం

చలి నుంచి ఉపశమనం పొందేందుకు కొందరు మూసివేసిన గదుల్లో బొగ్గులు, కట్టెలు లేదా ఇతర ఇంధనాలను మండిస్తుంటారు. ఇది అత్యంత ప్రమాదకరం. తగిన గాలి ప్రసరణ లేకపోతే కార్బన్ మోనాక్సైడ్, కార్బన్ డయాక్సైడ్ వంటి విషవాయువులు పేరుకుపోయి ప్రాణాపాయం కలిగించవచ్చు. హీటర్‌లు ఉపయోగించేవారు భద్రతా సూచనలు పాటించాలి. మండుతున్న మంటలను నిర్లక్ష్యంగా వదిలేయకూడదు. చలి నుంచి రక్షణ కోసం మద్యం సేవించడం కూడా సరైన పద్ధతి కాదు. మద్యం శరీర ఉష్ణోగ్రత తగ్గే ప్రమాదాన్ని పెంచుతుందని వైద్యరంగ నిపుణులు తెలుపుతున్నారు. విపరీతమైన వణుకు, మాట తడబడటం, అయోమయం, అసాధారణ నిద్రమత్తు, తీవ్రమైన బలహీనత, శ్వాసలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకూడదు. అలాంటి వారిని వెంటనే వెచ్చని ప్రదేశానికి తరలించి వైద్య సహాయం పొందాలి. చలికి గురైన చేతులు, కాళ్లు మొద్దుబారడం లేదా చర్మం తెల్లగా మారడం వంటి లక్షణాలు కనిపించినా వైద్యుడిని సంప్రదించాలి.

జాగ్రత్తలు పాటిస్తే చలి నుంచి ఉపశమనం

చలి తీవ్రత నుంచి రక్షణ పొందేందుకు కొన్ని సాధారణ జాగ్రత్తలు ఎంతో ఉపయోగపడతాయి. శరీరాన్ని వేడిగా ఉంచే దుస్తులు ధరించాలి. తల, చెవులు, మెడ, చేతులు, పాదాలను చలి నుంచి కాపాడుకోవాలి. తడిసిన దుస్తులను వెంటనే మార్చుకోవాలి. ఉదయం, రాత్రి వేళల్లో చలిగాలులు ఎక్కువగా ఉన్నప్పుడు బయట తిరగడం తగ్గించాలి. తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సి వస్తే శరీరాన్ని పూర్తిగా కప్పే దుస్తులు ధరించాలి. వేడి ఆహారం తీసుకోవడంతోపాటు తగినంత నీరు తాగాలి. పండ్లు, కూరగాయలు, పోషకాహారానికి ప్రాధాన్యమివ్వాలి.







3 నుంచి 4 నెలల్లో చామనపల్లి భూసేకరణ, పునరావాస ప్రక్రియ పూర్తి

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కలెక్టర్ కోయ శ్రీహర్ష
8 బృందాలతో 7 రోజుల్లో సామాజిక ప్రభావ అంచనా సర్వే

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త: చామనపల్లి గ్రామ ముంపు సమస్యను పరిష్కరించేందుకు గ్రామం మొత్తానికి భూసేకరణ చేసి, అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం, పునరావాసం కల్పిస్తామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. మంగళవారం ధర్మారం మండలం చామనపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ, భారీ వర్షాలు, నీటిని ఎత్తిపోసే సందర్భాల్లో గ్రామం ముంపునకు గురవుతోందని తెలిపారు. ఈ ప్రాంతంతో తనకు సుమారు 25 సంవత్సరాల అనుబంధం ఉందని, ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా అర్థం చేసుకొని పరిష్కారం చూపాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. సాధారణంగా ఎఫ్‌టీఎల్ నుంచి 100 మీటర్ల పరిధిలోనే భూసేకరణకు అవకాశం ఉన్నా, చామనపల్లి ప్రజల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకొని మొత్తం గ్రామానికి భూసేకరణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఈ ప్రక్రియ ప్రారంభమైందని, గ్రామస్తులు అధికారులకు సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పరిహారం, పునరావాసానికి సంబంధించిన సందేహాలను నివృత్తి చేస్తూ ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టు బలోపేతంలో భాగంగా నంది మేడారం చెరువు బలోపేతం నేపథ్యంలో గ్రామస్తులు భూసేకరణ, పునరావాసం కోరారని వివరించారు. 2023లో ఏర్పాటు చేసిన ముగ్గురు సభ్యుల కమిటీ ఎఫ్‌టీఎల్ నుంచి 100 మీటర్ల పరిధిలో భూసేకరణకు సిఫారసు చేసిందని, ప్రస్తుతం ప్రభుత్వం గ్రామం మొత్తానికి భూసేకరణ చేపట్టాలని ఆదేశించిందని తెలిపారు. గ్రామంలోని ఇళ్లు, కుటుంబ సభ్యులు, చెట్లు, బావులు, ఇతర ఆస్తుల వివరాలు నమోదు చేసి అంచనాలు రూపొందిస్తున్నామని చెప్పారు. సామాజిక ప్రభావ అంచనా సర్వే కోసం 8 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, ప్రతి ఇంటికి ప్రాజెక్టు నంబరు కేటాయిస్తూ వీడియో రికార్డింగ్‌తో 7 రోజుల్లో సర్వే పూర్తి చేస్తామన్నారు. సర్వే అనంతరం ఆర్‌అండ్‌ఆర్ కమిటీ ద్వారా పునరావాసానికి పరిశీలనలో ఉన్న 2 ప్రాంతాలపై నిర్ణయం తీసుకుంటామని, స్థలాల కేటాయింపుతో పాటు అర్హులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అవకాశాన్ని కూడా పరిశీలిస్తామని వివరించారు. భూసేకరణ, పరిహారం, పునరావాస సమస్యల పరిష్కారానికి ఆర్డీవో బి. గంగయ్య, తహసీల్దార్ అందుబాటులో ఉంటారని, 3 నుంచి 4 నెలల్లో ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వనజ, తహసీల్దార్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, చామనపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్ పరామర్శ

పెద్దపల్లి, ప్రభాతవార్త: పెద్దపల్లి పట్టణం సుభాష్ నగర్‌కు చెందిన కుమ్మరికుంట రాజేశ్వరి ఇటీవల మృతి చెందగా, ఆమె కుమారుడు, ఆర్ ఎస్ ఎస్ కరీనగర్ విభాగ్ సహా సంపార్క్ ప్రముఖ్ కుమ్మరికుంట సుధాకర్‌ను, ఆయన కుటుంబాన్ని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మంగళవారం పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట ఆర్ ఎస్ ఎస్ విభాగ్ సహకార్యవ కొంపెల్లి రాజన్న, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం, నల్ల మనోహర్ రెడ్డి పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు, గాయత్రి కళాశాలల అధినేత అల్లెంకి శ్రీనివాస్, భగవాన్, రాజన్న,జలపతి, మధు, శ్రీధర్ పాల్గొన్నారు.





రక్తదానం.. ప్రాణదానంతో సమానం!

అమరవీరుల స్మృతిలో పోలీసుల రక్తదాన శిబిరం

రక్తదానం మానవతకు ప్రతీక

ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలి: సీపీ గౌష్ ఆలం

కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త: రక్తదానం మరొకరి ప్రాణాన్ని కాపాడే మహోన్నత సేవ అని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కరీంనగర్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన మాట్లాడారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

రక్తదానంతో ప్రాణరక్షణ

రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడవచ్చని సీపీ పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడం పోలీసుల ప్రధాన కర్తవ్యమని, రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు సకాలంలో రక్తం అందించడం ఎంతో కీలకమని తెలిపారు. ప్రతి ఒక్కరూ



స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానానికి కులం, మతం, ప్రాంతం, లింగభేదాలతో సంబంధం లేదని, ఇది మానవత్వం, సమానత్వానికి నిదర్శనమని అన్నారు. రక్తదానం చేసేవారు ముందుగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, అనంతరం వైద్యుల సూచనల మేరకు తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

ప్రతి ఏటా అక్టోబరు 21న నిర్వహించే పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసుల సేవలను స్మరించుకుంటామని సీపీ తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇప్పటివరకు 47 మంది పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణాలర్పించారని పేర్కొన్నారు. వారి త్యాగాలను స్మరించుకోవడంతో పాటు అమరవీరుల కుటుంబాలను గౌరవించడం సమాజ బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏసీపీలు శ్రీనివాస్, శ్రీనివాస్ జి., వెంకటస్వామి, విజయకుమార్, స్వామి పాల్గొన్నారు. శిబిరానికి సహకరించిన ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ వైద్యాధికారి డాక్టర్ ఉషారాణి, ఆర్ఎంఓ, వైద్య బృందానికి, స్వచ్ఛందంగా రక్తదానం చేసిన వారికి సీపీ పోలీసు శాఖ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

నవంబర్ 5న కరీంనగర్ లో మహా ర్యాలీ

దేశమంతా చర్చ జరిగేలా వేలాది

మందితో వినూత్న రీతిలో ర్యాలీ నిర్వహిస్తాం.

కేంద్ర ప్రభుత్వ లబ్ధిదారులతోపాటు

అన్ని వర్గాలను ర్యాలీలో భాగస్వామ్యం చేస్తాం

సర్ పేరిట కాంగ్రెస్, విపక్షాలు చేస్తున్న

విష ప్రచారాన్ని తిప్పికొడదాం

కరపత్రాల రూపంలో ప్రజలకు వాస్తవాలు చెబుదాం

మీడియా, సోషల్ మీడియా ద్వారా జనాన్ని చైతన్యం చేద్దాం

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి.సంజయ్ కుమార్.

బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ నేతలతో కేంద్ర మంత్రి భేటీ

కరీంనగర్, ప్రతినిధి ప్రభాతవార్త : సర్ పేరుతో నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని కూల్చి విదేశీ శక్తులతో కలిసి దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కాంగ్రెస్, సీజేపీ, ఆప్ సహా చేస్తున్న కుట్రలకు వ్యతిరేకంగా ఈనెల 5న కరీంనగర్ లో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం అరాచకత్వాన్ని అంతం చేద్దాం" పేరిట భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో వేలాది మందితో మహా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావుతోపాటు జాతీయ ప్రతినిధులు కూడా ఈ ర్యాలీకి హాజరవుతారని దేశమంతా చర్చ జరిగేలా వినూత్న రీతిలో ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. మంగళవారం కరీంనగర్ లోని శుభమంగళ కన్వెన్షన్ లో బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మండలాధ్యక్షులు, మండల ఇంచార్జీలుసహా ముఖ్య నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ర్యాలీ ఏర్పాట్లు, జన సమీకరణపై చర్చించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించారంటూ కాంగ్రెస్, విపక్ష కూటమి నేతలు విష ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు యత్నిస్తున్నాయి. ఈ 13 కోట్లలో సుమారు 2.8 కోట్ల మంది మరణించారు. దాదాపు 3 కోట్ల మంది క్షేత్రస్థాయి పరిశీలనలో అడ్రస్‌లలో అందుబాటులో లేరు. 6.3 కోట్ల మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. మరో కోటి మంది ఓటర్ల పేర్లు రెండు, మూడు చోట్ల ఓటర్ లిస్టులో నమోదు చేసుకున్నారు. చనిపోయిన ఓటర్లను ఓటర్ జాబితా నుండి తొలగించాలా? వద్దా? అంతెందుకు మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు చనిపోయి ఏళ్లు దాటినా ఇంకా ఓటర్ జాబితాలో ఆయన పేరుంది. సర్



ప్రక్రియలో భాగంగా ఆయన పేరును తొలగించారు? ఇందులో తప్పేముంది? అట్లాగే డూప్లికేట్ ఓట్లను తొలగిస్తే రాద్ధాంతమెందుకు? అట్లాగే విదేశాల నుండి అక్రమంగా వలస వచ్చి ఓటర్లుగా నమోదైన రోహింగ్యాల ఓట్లను తొలగిస్తే తప్పేముంది?కాంగ్రెస్, బీఆర్ఎస్ వంటి పార్టీలు హైదరాబాద్ లో రోహింగ్యాల ఓట్లతోనే గెలుస్తూ వస్తున్నాయి. మహేశ్వరం నియోజకవర్గంలో దాదాపు 40 వేలకు పైగా రోహింగ్యాలు ఓటర్లుగా నమోదై బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాయి. పాతబస్తీలో మజ్లిస్ పార్టీ సైతం రోహింగ్యాలు, డూప్లికేట్ ఓట్లు, మరణించిన వారి ఓట్లతోనే గెలుస్తూ వస్తోంది. నాటి కేసీఆర్ ప్రభుత్వంతోపాటు నేటి కాంగ్రెస్ ప్రభుత్వం సైతం రోహింగ్యాలకు రేషన్ కార్డు, ఇండ్లుసహా ప్రభుత్వ పథకాల లబ్ధి కల్పించాయి. అర్హులైన ఇతర ఓటర్లకు అన్యాయం చేశాయి. సర్ ప్రక్రియలో భాగంగా రోహింగ్యాల ఓట్లను ఎన్నికల సంఘం తొలగిస్తుంటే ఆయా పార్టీలు తట్టుకోలేక మోదీ ప్రభుత్వంపై అభాండాలు వేస్తున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలను ధ్వంసం చేసేందుకు కుట్రలు చేస్తున్నాయి.ఎన్నికల్లో మోదీని ఎదుర్కొనే శక్తి లేక కాంగ్రెస్ కూటమి ఈ కుట్రలకు సిద్ధమైంది. విపక్షాల కుట్రలను తిప్పికొట్టేందుకు ప్రజలకు వాస్తవాలు చెప్పేందుకు ఈనెల 5న కరీంనగర్ లో లోక్ తంత్ర బచావోఅరాచకత హఠావో పేరిట వేలాది మందితో కనీవినీ ఎరగని రీతిలో వినూత్న రీతిలో దేశవ్యాప్తంగా చర్చ జరిగేలా మహా ర్యాలీ నిర్వహిద్దాం. కేంద్ర ప్రభుత్వ లబ్ధిదారులతోపాటు విద్యార్థులు, యువత, లాయర్లు, ఇంజనీర్లు, మేధావులు, డాక్టర్లుసహా అన్ని వర్గాల ప్రజలను ఈ ర్యాలీలో భాగస్వాములను చేద్దాం. కరపత్రాలు రూపొందించి ఇంటింటికీ పంపి ప్రజలను చైతన్యం చేద్దాం. కరీంనగర్ లో మహా ర్యాలీ నిర్వహించి దేశవ్యాప్తంగా చర్చ జరిగేలా చేద్దామని తెలిపారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రితోపాటు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు ఆంటోనీరెడ్డి, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు సాయిని మల్లేశం, రెడ్డబోయిన గోపి, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, పార్టీ సీనియర్ నేతలు కోమల ఆంజనేయులు, నల్లాల ఓదెలు, చెన్నమనేని వికాస్ రావు, మోహన్ రెడ్డి, గంగాడి క్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదలకు భరోసా

డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య

గోదావరిఖని ,ప్రభాతవార్త: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే పేదలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య అన్నారు. సన్నబియ్యం పంపిణీ, సబ్సిడీపై వంటగ్యాస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు వంటి పథకాలను తమ



ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. రామగుండంలోనూ ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ఠాకూర్ ఎన్నికైన తర్వాత అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ జె. అరుణశ్రీ, గృహ నిర్మాణ శాఖ పీడీ పవన్‌కుమార్, ఎంఆర్ఓ రవీందర్, స్థానిక కార్పొరేటర్ కొలని కవితతో పాటు పలువురు కార్పొరేటర్లు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



కాటన్ మార్కెట్‌లో.. అంత దగా.. దగా..

వ్యాపార వర్గాలు, మార్కెట్ అధికారులతో కుమ్మక్కై అయ్యారన్న అపవాదులు.. నియోజకవర్గంలో సర్వత్ర వినిపిస్తున్నాయి. ఇది ఇలా ఉండగా ఇప్పటికే సర్కార్ పెట్టిన సిఎంఆర్ ధాన్యం కొట్లాది రూపాయలు కొల్లగొట్టిన వ్యాపారులు కాటన్‌లో మేమేమైన తక్కువనా..? అని అనుకున్నారో ఎమో.. సరికొత్త దందాకు శ్రీకారం చుట్టి గత నాలుగు రోజులుగా రైతులను అడుగడుగున దగా చేస్తున్నారు. క్వింటాల్‌కు 9250 రూపాయలకు ధర పెట్టిన వ్యాపారులు మార్కెట్ వేలం పాటలో పత్తి నాణ్యతను బట్టి ఒక నిర్దిష్టమైన ధర నిర్ణయించి చీటిపై వేసి రైతుకు అందిస్తారు. ఏ మిల్లు పేరు సూచిస్తారో.. ఆ మిల్లు యజమాని అయితే దానిని కొనుగోలు చేస్తారో.. అక్కడికి వెళ్లాక ఆ మిల్లు యజమానులు, మార్కెట్‌లో పాలకవర్గం, మార్కెట్ అధికార యంత్రాంగం, ఖరీదుదారులు, అడ్తిదారులు అందరూ కలిసి నిర్ణయించిన ధరను మిల్లుకు వెళ్లాక.. మరో మారు తూకాలు వేసి మార్కెట్‌లో 8900 రూపాయలకు క్వింటాల్‌కు ధర రాసిచ్చాక జిన్నింగ్ మిల్లుకు వెళ్లాక అక్కడ వ్యాపారులు క్వింటాకు 200 నుండి 150 రూపాయలు కట్ చేస్తూ ధరలు నిర్ణయిస్తుండడంతో సోమవారం రైతులు మార్కెట్ కార్యాలయానికి వెళ్లి ఆందోళనకు దిగారు. దీనితో స్పందించిన మార్కెట్ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం మార్కెట్ పాలకవర్గ సభ్యులు, మార్కెట్ అధికారులు పలు కాటన్ మిల్లులకు వెళ్లి విలాసాగర్ గ్రామానికి చెందిన ఓ రైతుకు జరిగిన అన్యాయాన్ని మార్కెట్ చైర్‌పర్సన్ ప్రశ్నించగా, నీకు జవాబు చెప్పవల్సిన అవసరం లేదు..? నీకు దిక్కు ఉన్నకాడా చెప్పుకో..? ఏం చేసుకుంటావో చేసుకో.. నీతో ఏమి కాదు.. అంటూ దళిత చైర్‌పర్సన్ కావడంతో తనను అగౌరవ పర్చారని మిల్లు యజమానులపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసారు. గత 40 సంవత్సరాలలో ఈ మార్కెట్‌లో చైర్మన్ గిరి దళితులెవ్వరికి రాకపోవడం, ఆగ్రవర్ణాల వారే ఉండడం వల్ల ఇప్పుడు దళితులకు రావడంతో జీర్ణించుకుంటలేరని మమ్ములను అవహేళన చేస్తున్నారని మార్కెట్ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం ప్రభాతవార్తతో అవేదన వ్యక్తం చేసారు. సోమవారం జరిగిన సంఘట నలకు కాటన్ వ్యాపారులు సిండికేట్‌గా మారి మంగళవారం ఉదయం రైతులు తీసుకువచ్చిన పత్తిని కొనుగోలు చేయవద్దని ఖరీదుదారులు బీష్మించుక కూర్చోవడంతో మద్యాహ్నం 12గంటల వరకు రైతులు మండుతున్న ఎండలో పడరాని పాట్లు పడ్డారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న, మార్కెట్ కార్యదర్శి మల్లేషంలు వ్యాపారులతో సంప్రదింపులు జరిపినప్పటికి వారు మొండికేయడంతో హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఓడితల ప్రణవ్ బాబు, జిల్లా తూనికల, కొలతల అధికారి షాబోద్దిన్ వ్యాపారులతో సంప్రదించి కొనుగోళ్లకు ఒప్పించారు. కొనుగోళ్లు ఆలస్యం అయినప్పటికి మార్కెట్‌కు 1101 క్వింటా పత్తి మార్కెట్‌కు రాగా.. కనిష్ట ధర క్వింటాల్‌కు 9100, గరిష్ట ధర క్వింటాల్‌కు 8600, మోడల్ ధర 8850 రూపాయలు నిర్ణయించి కొనుగోళ్లు చేసారు. దీనితో కొనుగోళ్లు చాలా ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. మార్కెట్‌లో పత్తి వ్యాపారులు అనేక విధాలుగా రైతులను తూకాల పేరుతో, లోడింగ్, అన్‌లోడింగ్ పేరుతో దోచుకుంటున్నారని రైతులు ప్రభాతవార్తతో అవేదన వ్యక్తం చేసారు. సుమారు 200 మంది రైతులు వ్యాపారుల మొండితనం వల్ల రైతులు మండుతున్న ఎండలో ఉప్పిడి ఉపవాసాలతో సాయంత్రం వరకు మార్కెట్‌లో అష్టకష్టాలపాలయ్యారు.

తీరు మారని వ్యాపారులు..

జమ్మికుంట వ్యవసాయ కాటన్ మార్కెట్‌లో గత 15 సంవత్సరాలలో జరిగిన సంఘటనలు అన్ని.. ఇన్ని కావు. సిసిఐలో వ్యాపారులు భాగస్వామ్యంతో కొట్లాది రూపాయల అక్రమాలు జరుగగా, గత సంవత్సరం 40కోట్ల గన్ని సంచుల కుంభకోణం జరిగింది. అనేక మిల్లుల మీద రాష్ట్ర ప్రభుత్వం మిల్లులకు ఇస్తున్న సిఎంఆర్ వరిధాన్యాన్ని ఇతర రాష్ట్రాలకు అమ్ముకుని కొట్లాది రూపాయలు సొమ్ము చేసుకోగా, పలు రైస్ మిల్లులపై ఒక్కొక్క మిల్లుపై రెండు నుండి నాలుగు 6(ఎ) కేసులు నమోదై ఉన్నాయి. నిన్న గాక మొన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతాంగానికి సన్నరకాలకు క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ ఇస్తూ సన్న వడ్లు కొనుగోలు చేసి, మిల్లు యజమానులకు అప్పగిస్తే.. కొట్లాది రూపాయలకు అమ్ముకుని సన్నబియ్యం స్థానంలో ప్రభుత్వానికి దొడ్డు బియ్యం ఎఫ్‌సిఐకి పెట్టి రెడ్ హ్యాండెడ్‌గా విజిలెన్స్ ఆండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు పట్టుబడగా.. రాష్ట్ర సిబి సిఐడి అధికారులు మూడు రోజుల క్రితం అరెస్టు చేసి జైళ్లకు పంపిన వ్యాపార వర్గాల్లో మార్పు రాకపోవడం శోచనీయమని రైతు సంఘాలు వాపోతున్నాయి. రైతులు తెచ్చిన పత్తిని కొనుగోలు చేయకుండా వారిని అర్ధ ఆకలితో ఎండలో మాడుస్తూ.. మిట్టమధ్యాహ్నం వరకు మిల్లర్లు మొండికేయడం పట్ల ప్రజాసంఘాలు, రైతు సంఘాలు, రాజకీయ పార్టీల నేతలు వ్యాపారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. జమ్మికుంట కాటన్ ఇండస్ట్రీని ఒక బడా కాటన్ వ్యాపారి తన చెప్పుచేతుల్లో పెట్టుకుని ఇష్టా రాజ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనలకు తూట్లు పొడుస్తూ వ్యవహరిస్తున్నాడని ఆ సేటు చెప్పిందే రేటు.. అడ్తిదారులు, గుమస్తాలు వినవల్సిందేనని ప్రభుత్వం మార్కెట్ అధికార యంత్రాంగం ఆయన చెప్పుచేతుల్లో కేంద్రీకృతమై ఉండడంతో రైతుల పక్షాన ప్రశ్నించడానికి ఎవరు సాహసం చేయడంలేదని మార్కెట్‌లో పలు వర్గాల కార్మికులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

ఫామ్ పాండ్స్ ద్వారా నీటిని నిల్వ చేసుకొని పంటలను కాపాడుకోవాలి

జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్





కోరుట్ల రూరల్, ప్రభాతవార్త : రానున్న ఆరు నెలల్లో ఎల్‌నినో ప్రభావం కారణంగా తాగునీరు, సాగునీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నందున నీటి సంరక్షణకు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం కోరుట్ల మండలంలోని ధర్మారం గ్రామంలో ఓ రైతు తన మామిడి తోటలో ఏర్పాటు చేసుకుంటున్న ఫామ్ పాండ్‌ను, జిల్లా కలెక్టర్ పరిశీలించారు. రానున్న వేసవిలో నీటి కొరత ఏర్పడకుండా వర్షపు నీటిని ఒడిసిపట్టి నిల్వ చేసుకోవడం ఎంతో అవసరమని తెలిపారు. కోరుట్ల మండల పరిధిలో సుమారు రెండు లక్షల ఎకరాల వ్యవసాయ భూములకు నీటి లభ్యతను మెరుగుపరిచే లక్ష్యంతో మొత్తం 75 ఫామ్ పాండ్స్ మంజూరు చేయగా, ఇప్పటివరకు 12 పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన ఫామ్ పాండ్స్ పనులను రానున్న నెల రోజుల్లో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మధ్య మధ్యలో చిరుజల్లుల రూపంలో వర్షాలు కురిసినా, ఆ నీటిని ఫామ్ పాండ్స్‌లో నిల్వ చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో పంటలకు కొంతమేర నీటిని అందించే అవకాశం ఉంటుందని వివరించారు. ఐదు ఎకరాల భూమి కలిగిన రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో సుమారు రెండు గుంటల విస్తీర్ణంలో ఫామ్ పాండ్ ఏర్పాటు చేసుకుంటే నీటి ఎద్దడి సమయంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కలెక్టర్ సూచించారు. భూగర్భ జలాలు తగ్గినప్పుడు, వర్షాలు లేక పంటలు ఎండిపోయే పరిస్థితులు ఏర్పడినప్పుడు ఈ నీటి నిల్వలు రైతులకు అండగా నిలుస్తాయని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) నుంచి సాగునీరు వచ్చే అవకాశం లేనందున రైతులు నీటి వినియోగంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వరి, చెరకు వంటి అధిక నీటి అవసరం ఉన్న పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని అన్నారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని పంటల ఎంపిక చేసుకోవడం ద్వారా నీటి కొరత ప్రభావాన్ని తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన మండలంలోని ధర్మారం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలలోని విద్యార్థుల మరుగుదొడ్లు, బోరు, అంగన్‌వాడీ కేంద్రం, వంటశాలను పరిశీలించి, విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని నిర్ణీత మెనూ ప్రకారం అందించాలని, భోజనం తయారీలో పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, డీఆర్‌డీఓ రఘువరన్, ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్దార్ కృష్ణ చైతన్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు .

కేరళ హైస్కూల్‌లో పోలీస్ ఫ్లాగ్ డే పై వ్యాసరచన పోటీలు

కోరుట్ల, ప్రభాతవార్త :

భారతదేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21 నుంచి 31 వరకు నిర్వహించే పోలీస్ ఫ్లాగ్ డే, పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా కోరుట్ల పట్టణంలోని కేరళ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాల నియంత్రణలో ప్రజలు, పోలీసుల పాత్ర", "డ్రగ్స్ మహమ్మారి నివారణ లో పోలీసుల పాత్ర - విద్యార్థులు డ్రగ్స్‌కు ఎలా దూరంగా ఉండాలి?" అనే అంశాలపై 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలనూ కోరుట్ల పోలీస్ శాఖకు చెందిన కానిస్టేబుళ్లు శ్రీ ఎస్. గంగాధర్, శ్రీ టి. అరుణాచలం ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండటం, ఆన్‌లైన్ మోసాల నివారణలో ప్రజలు



తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, విద్యార్థులు వాటికి దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించుకోవాల్సిన ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడంతో పాటు, పోలీసుల సేవలు, త్యాగాల పట్ల గౌరవభావాన్ని కలిగించడం ముఖ్య ఉద్దేశమని పాఠశాల కరస్పాండెంట్ ఎం.ఏ. బారి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సెలెన్ బారి, చైర్మన్ ఎం.ఏ. హాది, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కట్టడాలు తొలగింపు

కోరుట్ల, ప్రభాతవార్త :



కోరుట్ల మున్సిపాలిటీ పరిధిలో అనుమతులకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలపై అందిన ఫిర్యాదులు, కోర్టు కేసుల నేపథ్యంలో, ఎన్‌ఫోర్స్ మెంట్ టీమ్ లీడర్ ఆదేశాల మేరకు మంగళవారం కోరుట్ల పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న భవనంలోని నిబంధనలకు విరుద్ధమైన నిర్మాణ భాగాన్ని, అంబేద్కర్ రోడ్డు ప్రాంతంలో రోడ్డును ఆక్రమించి నిర్మించిన గోడను కూల్చివేసి ఆక్రమణను తొలగించినట్లు కమిషనర్ తెలిపారు. కోరుట్ల మున్సిపాలిటీ ప్రజలు మంజూరైన భవన నిర్మాణ అనుమతులకు విరుద్ధంగా లేదా సరైన అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదన్నారు. నిబం ధనలు ఉల్లంఘించిన వారిపై తెలంగాణ మున్సిపాలిటీల చట్టం, 2019 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయం వద్ద ఉన్న చికెన్ సెంటర్ పై చర్యలు తీసుకోవాలి

కోరుట్ల, ప్రభాతవార్త :



కోరుట్ల పట్టణంలోని 32వ వార్డు, ఐబీ రోడ్డులో హనుమాన్ దేవాలయానికి సుమారు 30 మీటర్ల లోపల ఉన్న ఐకే చికెన్ సెంటర్‌పై విచారణ జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ మేనేజర్ కు 32 వ వార్డు నాయకుడు ఇట్యాల నవీన్ కుమార్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయానికి ఇంత సమీపంలో చికెన్ సెంటర్ ఉండటంపై స్థానిక ప్రజలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని, మాంస వ్యర్థాల నిర్వహణ, దుర్వాసన, పరిసరాల పరిశుభ్రత, ప్రజారోగ్యానికి సంబంధించిన అంశాలను అధికారులు పరిశీలించాలన్నారు.



జాతీయ స్థాయి ఖేలో ఇండియా క్యాంప్‌కు కేపీస్ విద్యార్థిని

కోరుట్ల అర్బన్, ప్రభాతవార్త :



కోరుట్ల పబ్లిక్ స్కూల్ విద్యార్థిని అల్లె హేమ జాతీయ స్థాయి ఖేలో ఇండియా ఛాంపియన్‌షిప్ క్యాంప్‌కు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ గుజ్జేటి వెంకటేష్ తెలిపారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో 45 రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ స్థాయి శిక్షణ శిబిరానికి హేమ ఎంపికైంది. అనంతరం డిసెంబర్ నెలలో వరంగల్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి ఖేలో ఇండియా క్రీడల్లో పాల్గొనేందుకు ఆమెకు అవకాశం లభించనుంది. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ కోరుట్ల పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరుస్తూ సర్వతోముఖ అభివృద్ధి సాధిస్తున్నారని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. జిల్లా, రాష్ట్ర స్థాయిలను దాటి జాతీయ స్థాయికి చేరుకున్న హేమ సాధించిన ఈ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తినిస్తుందని ఈ సందర్భంగా అల్లె హేమను పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు. జాతీయ స్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, తెలంగాణ రాష్ట్రానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

డీడీఎన్ కోరుట్ల మండల సమావేశం

కోరుట్ల టౌన్, ప్రభాతవార్త :



పట్టణంలోని వేణుగోపాల స్వామి దేవాలయం లో కోరుట్ల మండల దూప, దీప నైవేద్య అర్చక సంఘ సమావేశం మండల అధ్యక్షులు బ్రహ్మన్నగారి శంకర్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా డీడీఎన్ అధ్యక్షులు నాగరాజు మహేంద్ర చారీ, శంకర్ శర్మ లు మాట్లా డుతూ అర్చకులు అందరు ఐకమత్యంతో కలిసి మెలిసి ఉంటే ఎంతటి సమస్యను అయినా పరిష్కరించుకోగలమని, సంఘం పటిష్టంగా ఉండా లంటే ఆర్థిక వనరులు సమకూర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా భాద్యులు సేనాపతి ప్రవీణ్ కుమారాచార్య, దేషు ముఖ్ ఫణీంద్ర శర్మ, శ్యామ్ సుందర్ శర్మ,కిరణ్ చక్రపాణి, సునీల్, కిషన్, గిరి,పవన్, మనోజ్, లచ్చయ్య, రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ప్రొబేషన్ డిక్లేర్ చేసి ఇంక్రిమెంట్ మంజూరి చేయాలి

టి ఎస్ యూటీఫ్ వినతి.



జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త: టీఎస్ యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్య దర్శులు మంగళవారం తిరుకోవెల శ్యామ్ సుందర్, అంబటి భూమేశ్వర్ లు జిల్లా విద్యాధికారి కెలవత్ రాము కు 2024 డీఎస్సీ లో ఉపాధ్యాయులుగా నియామకం అయిన వారికి ప్రొఫెషన్ డిక్లేర్ చేస్తూ రెండవ ఇంక్రిమెంట్ను వెంటనే మంజూరు చేయాలని ప్రాతినిధ్యం చేయడం జరిగింది మరియు జిల్లాలోని ఇతర పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరడం జరిగింది.

జనగామకు అభివృద్ధి ఫలాలు

గ్రామమంతా తిరిగిన సింగరేణి అధికారులు

గోదావరిఖని, ప్రభాతవార్త: సింగరేణి ప్రభావిత జనగామ గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కదలిక వచ్చింది. గ్రామంలో నెలకొన్న సమస్యలను స్వయంగా పరిశీలించిన సింగరేణి ఆర్జీ1 జీఎం డి.లలిత్‌కుమార్, సంబంధిత విభాగాల అధికారులు.. ప్రాధాన్య క్రమంలో పనులు చేపడతామని హామీ ఇచ్చారు. స్థానిక కార్పొరేటర్ తోకల శ్యామణి రమేష్, గ్రామ నాయకులతో కలిసి గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు.గ్రామ కమాన్ నుంచి ఊరి వరకు సోలార్ వీధి దీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. జీఎం కాలనీ మోరి వద్ద పేరుకుపోయిన చెత్త, రోడ్డుపైకి ప్రవహిస్తున్న మురుగునీటి సమస్యను అధికారులకు వివరించారు. కాలువల ద్వారా సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. క్రీడా మైదానంలో బహిరంగ వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేయడంతోపాటు అక్కడి నుంచి బైపాస్ రహదారికి అనుసంధాన రోడ్డు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.చెరువు వద్ద కాలువ ఎత్తు పెంచడం, కట్టను విస్తరించి మెటల్ రోడ్డు వేయడం, పూడిక తీయడం వంటి పనులను ప్రతిపాదించారు. ఐకేపీ కేంద్రంలో మట్టితో చదును చేయడం, స్మశానవాటికలో షెడ్డు నిర్మాణం, గోదావరి రహదారిపై కల్వర్టు ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామంలోని ప్రధాన ఆలయాలకు మండపాలు, పాఠశాలలో విద్యార్థుల కోసం ఉయ్యాలలు, జారుడు బండ ఏర్పాటు చేయాలని సూచించారు. ఎల్లమ్మ ఆలయం సమీపంలోని కుంట వద్ద స్లాబ్ కల్వర్టు నిర్మాణంతోపాటు ఇతర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ఈ పర్యటనలో సివిల్ డీజీఎం వరప్రసాద్, జనరల్ మేనేజర్ ఐఎఫ్ రమేష్, వర్క్‌షాప్ డీజీఎం జితేందర్‌సింగ్, గ్రూప్1 ఏజెంట్ రమేష్, ఎస్ఎస్‌వో మురళీమోహన్ పాల్గొన్నారు.



ప్రజలకు అండగా ఏఐఎంఐఎం నూతన టౌన్ కమిటీ

అధ్యక్షుడుగా సయ్యద్ ఉమైర్ అహ్మద్

పెద్దపల్లి, ప్రభాతవార్త: పెద్దపల్లి పట్టణంలోని మైనారిటీల సమస్యల పరిష్కారంతో పాటు ప్రజలకు అవసరమైన సదుపాయాల కల్పన కోసం కృషి చేస్తామని ఏఐఎంఐఎం నూతన కమిటీ అధ్యక్షుడుగా సయ్యద్ ఉమైర్ అహ్మద్ అన్నారు. పార్టీ అధ్యక్షుడు బ్యారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు టౌన్ కమిటీని ఏర్పాటు చేసినట్లు మంగళవారం ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. నూతన అధ్యక్షుడు సయ్యద్ ఉమైర్ అహ్మద్ మాట్లాడుతూ పార్టీ నాయకత్వం తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. మైనారిటీల సంక్షేమం, పార్టీ విస్తరణకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఉపాధ్యక్షుడు, లీగల్ అడ్వైజర్ మొహమ్మద్ ఇమ్రాన్ అడ్వకేట్ మాట్లాడుతూ ప్రజలకు సమస్యలు ఎదురైతే కలెక్టర్, తహసీల్దార్, పోలీసు అధికారులతో పాటు సంబంధిత శాఖలను సంప్రదించి న్యాయం జరిగేలా ప్రయత్నిస్తానన్నారు. పెద్దపల్లిలో మైనారిటీలకు ఉపయోగపడే ఫంక్షన్ హాల్, షాదీఖానా నిర్మాణం అవసరమని, స్థలం కేటాయించినట్లు చెబుతున్న ఫంక్షన్ హాల్‌కు ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలని కోరారు. కమాన్ సమస్యను కూడా నిబంధనల ప్రకారం పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీకి ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. నూతన కమిటీలో అధ్యక్షుడిగా సయ్యద్ ఉమైర్ అహ్మద్, ప్రధాన కార్యదర్శిగా మొహమ్మద్ కలీమ్, జాయింట్ సెక్రటరీలుగా మొహమ్మద్ ఇర్ఫాన్ అలీ, ఖాజా మోహినుద్దీన్, సయ్యద్ ముజాహిద్, షేక్ బర్కత్, కోశాధికారిగా ముఫ్తి ఇంతియాజ్ ఖాన్ బాధ్యతలు చేపట్టనున్నారు. కార్యవర్గ సభ్యులుగా షేక్ పర్వేజ్, సయ్యద్ ఇమ్రానుద్దీన్, మొహమ్మద్ ముజీబుద్దీన్, మొహమ్మద్ అబ్దుల్ ఫర్హాన్, షోయబ్ ఖాన్, మొహమ్మద్ ముజీబ్ ఖాన్ ఉన్నారు. సమావేశంలో మొహమ్మద్ జియావుద్దీన్, మొహమ్మద్ అస్లాం, మొహమ్మద్ ఫర్హాన్, అష్జల్, షేక్ హాజ్, అయ్మాన్ ఖాన్, మొహమ్మద్ గయాజ్, సబీర్ పాషా, అయాన్ పాషా, సయ్యద్ తౌఫీక్ తదితరులు పాల్గొన్నారు.



ఓదెల మల్లన్న ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించిన ప్రభుత్వ విప్ విజయరమణ రావు

ఓదెల,ప్రభాతవార్త:

పెద్దపల్లి జిల్లాలోనే అతిపెద్ద శైవ క్షేత్రమైన ఓదెల శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం అభివృద్ధికి రూ.15 కోట్ల వ్యయంతో చేపడ ుతున్న పునర్నిర్మాణ పనులు, వివిధ అభివృద్ధి పనులను ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు పరిశీలించారు. స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆలయ ప్రాంగణంలో కొనసాగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆలయ పునర్నిర్మాణ పనులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ విజయ రమణారావు మాట్లాడుతూ ఆలయ పున్న నిర్మాణ పనులు ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఈ పనులు తొందర్లోనే జరుగుతాయని వారన్నారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి స్థానిక సర్పంచ్ కనికిరెడ్డి సతీష్ మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్ కాంట్రాక్టర్లు నారాయణ,ప్రదీప్ కుమార్ వివిధ గ్రామాల సర్పంచులు తంగెళ్ల నరసింహారెడ్డి, గుగులోతు నిమ్మ, మాజీ ఎంపిటిసి లు బోడకుంట శంకర్, ముంజల రాజేశం, ఉప సర్పంచ్ మూల సంపత్ రెడ్డి, నాయకులు కొండ శ్రీనివాస్ గౌడ్, తీర్థాల వీరయ్య రాచర్ల రాకేష్ మీకు సంతోష్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



జూలపల్లిలో పంచాయతీ కార్యదర్శులతో డీఎల్‌పీవో సమీక్షా సమావేశం

జూలపల్లి,ప్రభాతవార్త:

జూలపల్లి మండల కేంద్రంలో మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి (డి ఎల్ పి ఓ) దేవకీ దేవి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిం చారు.గ్రామాల్లో పారిశుద్ధ్య,అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సమావేశంలో అధికారులను ఆదేశించారు. ప్రధానంగా క్రింది అంశాలపై సుదీర్ఘంగా సమీక్ష జరిపారు. పరిశుద్ధత,నిర్వహణ: సిగ్రిగేషన్ షెడ్ల (తడి,పొడి చెత్త సేకరణ కేంద్రాలు) సక్రమ నిర్వహణ,వర్మి కంపోస్ట్ తయారీ. చెత్త సేకరణ: ఇంటింటా చెత్త సేకరణ ప్రక్రియను మరింత సమర్థవంతంగా అమలు చేయడం. అభివృద్ధి పనులు: వైకుంఠ ధామాలు (స్మశాన వాటికల) నిర్వహణ తీరు. ఆర్థిక వనరులు: గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని అన్నారు.ఈ సమావేశంలో మండల పంచాయతీ అధికారి (ఎంపిఓ)శేషయ్య సూరి,పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.





ఇంద్రవెల్లి సభకు పెద్దపల్లి నుంచి భారీగా తరలిరావాలి

తెలంగాణ రక్షణ సేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ సురేంద్ర కొమురయ్య యాదవ్ పాంచజన్య, భూ లక్ష్య పథకాలపై ప్రజలకు వివరణ

పెద్దపల్లి, ప్రభాతవార్త: ఆదివాసీ గడ్డ ఇంద్రవెల్లిలో ఈ నెల 30న తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో జరిగే బహిరంగ సభకు పెద్దపల్లి నియోజకవర్గం నుంచి అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించి సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ సురేంద్ర కొమురయ్య యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని, ప్రతిపక్ష బీఆరఎస్ ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ పార్టీల వైఫల్యాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు రైతులు, పేదల హక్కుల పరిరక్షణపై సభలో చర్చించనున్నట్లు తెలిపారు. కవిత ప్రతిపాదించిన ‘పాంచజన్య కార్యక్రమం, భూమిలేని పేదలకు భూమి అందించే ‘భూ లక్ష్యం పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. జిల్లా అధ్యక్షురాలు సిరివెని స్వప్న మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు సామాజిక న్యాయం, ఉచిత విద్య, వైద్యం, ఆరోగ్య సదుపాయాలు, రైతుల సంక్షేమం పాంచజన్య కార్యక్రమ లక్ష్యాలని వివరించారు. తెలంగాణ అమరవీరుల ఆశయాలు ఇంకా పూర్తిగా నెరవేరలేదని, యువతకు విద్య, ఉపాధి అవకాశాలు మెరుగుపడాల్సి ఉందని అన్నారు. సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో మహిళలు, పేద పిల్లల భవిష్యత్తు కోసం కవిత పోరాడుతున్నారని పేర్కొన్నారు. బీసీ వర్గానికి చెందిన తనకు జిల్లా అధ్యక్షురాలిగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో బొంగోని శంకర్ గౌడ్, ఉస్తేమ్ శ్రీనివాస్ ముదిరాజ్, కార్ పాకల రమేష్, రవీందర్, చిట్టి మల్ల హనుమాన్లు, దాసరి అంజలి, సాగర్ల వాసవి, కూన రవళి, మోటం మల్లికార్జున్, సాగర్ల శ్రీకాంత్, చిలుక ఆనంద్, ఎద్దు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. యువత, మహిళలు, కార్యకర్తలు సభకు అధిక సంఖ్యలో రావాలని నాయకులు కోరారు.

వీధి దీపాల స్తంభాలకు ప్రకటనల బోర్డులా?

అడ్వర్టైజ్‌మెంట్ ఏజెన్సీలకు రూ.50 వేల జరిమానా

హెచ్చరికలు బేఖాతరు చేయడంతో నగరపాలక సంస్థ చర్య

మళ్లీ అతికిస్తే సామగ్రి స్వాధీనం

ఉల్లంఘనలపై చట్టపరమైన చర్యలు

గోదావరిఖని,ప్రభాత వార్త: కేంద్రీకృత వీధి దీపాల స్తంభాలకు అనధికారికంగా ప్రకటనల బోర్డులు, ఫ్లెక్సీలు కట్టిన అడ్వర్టైజ్‌మెంట్ ఏజెన్సీల నిర్వాహకులకు రామగుండం నగరపాలక సంస్థ రూ.50 వేల జరిమానా విధించింది. ఈ మేరకు మంగళవారం సంబంధిత నిర్వాహకులకు నోటీసులు జారీ చేసింది. ఫ్లెక్సీల వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తడంతోపాటు ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతోందని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు పేర్కొన్నారు. హెచ్చరికలు బేఖాత రువీధి దీపాల స్తంభాలకు ప్రకటనలు కట్టవద్దని గతంలో పలుమార్లు హెచ్చరించడంతోపాటు నోటీసులు జారీ చేసినా సంబంధిత ఏజెన్సీల నిర్వాహకులు పట్టించుకోలేదని అధికారులు తెలిపారు. దీంతో జరిమానా విధిస్తూ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. విధించిన జరిమానా చెల్లించక ‘పోయినా, తిరిగి స్తంభాలకు ఫ్లెక్సీలు కట్టినా వాటికి సంబంధించిన సామగ్రిని స్వాధీనం చేసుకుంటామని నోటీసుల్లో స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



లైంగిక వేధింపులపై విద్యార్థులు మౌనం పాటించవద్దు

సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్

.మెట్ పల్లి టౌన్ , ప్రభాత వార్త :

లైంగిక వేధింపులపై విద్యార్థులు మౌనం దాల్చవద్దని మెట్ పల్లి సీనియర్ సివిల్ జడ్జి ఆర్. అజయ్ కుమార్ అన్నారు. మండల్ లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో మంగళవారం సురక్షిత బచ్ పన్ అభియాన్ స్కీమ్ కింద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 18 ఏళ్ల లోపు వయసున్న ప్రతి విద్యార్థిని, విద్యార్థులు వారు ఎదుర్కొనే లైంగిక పరమైన మానసిక మరియు శారీరక వేధింపుల పట్ల భరించాల్సిన అవసరం లేదన్నారు. అమ్మాయిలు కావచ్చు, అబ్బాయిలు కావచ్చు వారు ఎదుర్కొనే అనుమానస్పద టచింగ్ లు, లైంగిక వేధింపుల గూర్చి తల్లిదండ్రులకు గానీ, ఉపాధ్యాయులకు గానీ చెప్పుకోవలని సూచించారు. ఒక వేల ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితి ఉంటే, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కి లేదా డయల్ 112 కి కూడా ఫిర్యాదు చేయొచ్చని సూచించారు. అంతకుముందు ఆయన



ఉపాధ్యయులు అందించిన మొక్కని స్కూల్ లో నాటి, మొక్కల్ని నాటడం కన్నా, కాపాడటం ముఖ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి వినుకొండ మాధవి, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ దయ్య రాజారాం , బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి రామ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, న్యాయవాదులు కోటగిరి వెంకట స్వామి, ఎలాల మధుసూధన్ రెడ్డి, తోగిటి రాజశేఖర్, నేరెళ్ల శ్రీధర్, జేడి సుధాకర్, డా.తుల రాజేందర్, వంగ వేణు, ప్రధాన ఉపాధ్యాయులు కే. నారాయణ, ఉపాధ్యాయులు గూరుడు వెంకట గిరి, గణేష్, సురేష్, మోహన్, రామేశ్వర రావు ఉన్నారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు ఓపెన్ హౌస్

మల్లాపూర్ ప్రభాతవార్త:

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని, మంగళవారం రోజున మల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో మోడల్ స్కూల్ విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పోలీస్ స్టేషన్ పనితీరు, పోలీస్ శాఖ విధులు, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర, నేరాల నియంత్రణ, ప్రజల రక్షణ కోసం పోలీసులు చేపట్టే చర్యల గురించి వివరించడం జరిగింది.అదేవిధంగా, పోలీస్ శాఖలో ఉపయోగించే వివిధ పరికరాలు, పోలీస్ విధులకు సంబంధించిన సామగ్రి గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. పోలీస్ శాఖ పనితీరును ప్రత్యక్షంగా తెలుసుకోవడం ద్వారా విద్యార్థుల్లో పోలీసుల పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు, చట్టాల పట్ల గౌరవం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత వంటి విలువలను అలవర్చుకోవాలని సూచించడం జరిగింది.దేశ రక్షణతో పాటు ప్రజల భద్రత కోసం విధులు నిర్వహిస్తూ ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను



స్మరించుకుంటూ, వారి సేవలు మరియు త్యాగాలు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పోలీస్ శాఖ పనితీరుపై అవగాహన కల్పించడంతో పాటు, పోలీస్-ప్రజల మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకోవడం జరిగింద. ఈ కార్యక్రమంలో ఎస్సై అనిల్ తో పాటు, ఎస్సై ప్రకాష్, లక్ష్మణ్, కానిస్టేబుల్ కిరణ్, పోలీస్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

పాల్గొన్న కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్

ఇబ్రహీంపట్నం, ప్రభాతవార్త:



మండలంలోని 58 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కులను కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ పంపిణీ చేశారు. మంగళవారం ఇబ్రహీంపట్నంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా మొత్తం రూ.58,06,728 విలువైన 58 చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం ఈ పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందిస్తోందని కార్యక్రమంలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వరప్రసాద్, ఎంపిడిఓ గణేష్, ఎమ్ఏఓ రాజ్ కుమార్ వివిధ ఇబ్రహీంపట్నం పాక్స్ ఛైర్మెన్ జిల్లాల పవన్, వివిధ గ్రామాల సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

మొగిలిపేట ప్రాథమిక పాఠశాల కు ప్రింటర్ వితరణ

మల్లాపూర్ ప్రభాతవార్త:



మల్లాపూర్ మండలంలోని మొగిలిపేట పాఠశాలకు 12వేల విలువగల ప్రింటర్ ను మొగిలిపేట గ్రామానికి చెందిన కైరం అంజయ్య (వార్డెన్) మంగళవారం బహూకరించారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయులు వేముల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మోళిక వసతుల కల్పనలో గ్రామస్థుల సహకారం మాకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తున్నదని , మరింతఉత్సాహంగాపనిచేయడానికి దోహదపడుతుందని తెలిపారు .ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, విడిసిఛైర్మెన్ప్రసాద్, ఉపాధ్యాయులు , రాజేందర్,మంజుల ,శ్రావణి,ప్రసన్న లు పాల్గొని కృతజ్ఞతలు తెలిపారు.

టీటీడీ కళ్యాణ మండపంలో సౌకర్యాలు కల్పించాలి

ఈదర్శన్ టోకెన్ కౌంటర్‌ను పునరుద్ధరించాలి:

బీజేపీ పట్టణ అధ్యక్షుడు దోనికెల నవీన్

మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త



:మెట్‌పల్లి పట్టణంలోని టీటీడీ కళ్యాణ మండపంలో అవసరమైన సౌకర్యాలు కల్పించి, సామాన్య ప్రజలకు అందుబాటు ధరల్లో శుభకార్యాలు నిర్వహించుకునే అవకాశం కల్పించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు దోనికెల నవీన్ కోరారు. మంగళవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి కళ్యాణ మండపాన్ని సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించారు.పెరుగుతున్న ధరలు, ప్రైవేట్ ఫంక్షన్ హాళ్ల అధిక అద్దెల కారణంగా సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు వివాహాలు, ఇతర శుభకార్యాలు నిర్వహించుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని నవీన్ పేర్కొన్నారు. టీటీడీ కళ్యాణ మండపంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు.అదేవిధంగా, గతంలో కళ్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన ఈదర్శన్ టోకెన్ కౌంటర్‌ను తిరిగి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. గతంలో ఈ కౌంటర్ ద్వారా భక్తులకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు అందుబాటులో ఉండేవని, ప్రస్తుతం ఆ సౌకర్యం లేకపోవడంతో స్థానిక భక్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అధికారులు స్పందించి ఈదర్శన్ కౌంటర్‌ను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.సామాన్య ప్రజలు, భక్తుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి బీజేపీ మెట్‌పల్లి పట్టణ శాఖ కృషి చేస్తుందని దోనికెల నవీన్ తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శులు జూంగుల అనిల్ గౌడ్, బత్తుల జగదీశ్వర్, పట్టణ ఉపాధ్యక్షుడు గుంటుక హనుమాన్లు, ఐటీ సెల్ కన్వీనర్ పాసికంటి శ్రీనివాస్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు సంకు ప్రసాద్, బొమ్మన రామస్వామి, మొగిలిపాక హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి వార్త

రేగుంట మీదుగా ఖానాపూర్ కు బస్సు నడపాలి



మల్లాపూర్ ప్రభాతవార్త:

కోరుట్ల బస్ డిపో నుంచి రేగుంట మీదుగా ఖానాపూర్ కు బస్సు సర్వీసు ప్రారంభించాలని కోరుట్ల బస్ డిపో మేనేజర్ ను రేగుంట సర్పంచ్ తీట్ల లహరి రాజేష్ కోరారు. ఈ మేరకు కోరుట్ల బస్ డిపో సూపరింటెండ్ గంగారావును కలిసి వినతిపత్రం అందజేశారు. రేగుంట గ్రామ ప్రజలు ప్రయాణికులు సౌకర్యార్థం ఈ డిపో మార్గంలో బస్సు సర్వీసు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. డిపో అధికారులు సానుకూలంగా స్పందించినట్లు సర్పంచ్ తెలిపారు. బస్సు సర్వీస్ ప్రారంభమైతే గ్రామ ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని అన్నారు.

కాలువ కబ్జాలను తొలగించాలి

మల్లాపూర్ ప్రభాతవార్త:

మల్లాపూర్ మండల కేంద్రంలోని రైతులకు చెరువు నుంచి దేవి కుంటలోకి నీరు వచ్చే కాల్వపై ఉన్న కబ్జాలను తొలగించి కాలువను పునరుద్దించాలని మల్లాపూర్ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ స్థానిక వార్డు సభ్యులతో కలిసి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీకాంత్ కు వినతి పత్రాన్ని మంగళవారం అందజేశారు. రేణిగుంట చెరువు నుంచి దేవి కుంటలోకి నీరు చేరే కాలువ అక్రమాలకు గురి కావడంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోందని తెలిపారు. కాలువను పునరుద్ది నుంచి నీరు దేవి కుంటలోకి చేరేలా చర్యలు తీసుకుంటే మల్లాపూర్ గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండే అవకాశం ఉందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాలువ కబ్జాలను తొలగించి నీటి ప్రవాహం సజావుగా సాగేల చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడాలి

మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి



మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త:

ఎల్ నినో ప్రభావం వల్ల నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండి నీటిని పొదుపుగా వాడుకోవాలని మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి పేర్కొన్నారు.మంగళవారంవాసవి క్లబ్ గ్రేటర్ మెట్‌పల్లి ఆధ్వర్యంలో నీటి పొదుపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి పొదుపు ఆవశ్యకతను తెలియజేస్తూ రూపొందించిన స్టిక్కర్లు, కరపత్రాలను మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరూ నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని, భవిష్యత్ తరాలకు నీటి కొరత లేకుండా చూడాలని ఈ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు మైలారపు రాంబాబు, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ జోన్ చైర్మన్ కోట కిరణ్ కుమార్, వాసవి క్లబ్ గ్రేటర్ మెట్‌పల్లి అధ్యక్షుడు కొండూరి రాజేష్, కార్యదర్శి గుండె శివకుమార్, కోశాధికారి కోటగిరి సంతోష్, కోట సతీష్, పుల్లూరి సనత్, మహాజన్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల పాత బస్టాండ్‌లో తీరని కష్టాలు

సిరిసిల్ల అర్బన్ ప్రభాత వార్త:

సిరిసిల్ల పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ప్రయాణికుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. అక్కడ ఉన్న పాత పబ్లిక్ టాయిలెట్లను తొలగించి ఆరు నెలలు గడుస్తున్నా.. కొత్తవి నిర్మించడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. నిత్యం వేలాది మంది ప్రయాణికులు, మరీ ముఖ్యంగా మహిళలు రాకపోకలు సాగించే ఆ రద్దీ ప్రాంతంలో మరుగుదొడ్లు లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రత్యామ్నాయంగా అధికారులు ఏర్పాటు చేసిన మొబైల్ టాయిలెట్లు సైతం అధ్వానంగా తయారయ్యాయి. వాటిలో కనీస నీటి సదుపాయం లేకపోవడం, నిర్వహణ లోపంతో ఎటుచూసినా అపరిశుభ్రత తాండవిస్తోంది. పరిసరాలు దుర్వాసన వెదజల్లుతుండటంతో ఆ దరిదాపుల్లోకి వెళ్లాలంటేనే ప్రయాణికులు జంకుతున్నారు.మహిళల ఇబ్బందుల పట్ల అధికారుల నిరక్ష్య వైఖరిని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు బరకం వెంకటలక్ష్మి తీవ్రంగా తప్పుబట్టారు. కనీస వసతులు కల్పించడంలో యంత్రాంగం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, తక్షణమే నూతన పబ్లిక్ టాయిలెట్లను నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సమస్యను ఇలాగే వదిలేస్తే.. రాబోయే రోజుల్లో మహిళలందరినీ ఏకతాటిపైకి తెచ్చి అధికారుల తీరుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఆమె హెచ్చరించారు.



రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో చర్యలు చేపట్టాలి

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని, పెండింగ్ లో ఉన్న రహదారులు మరమ్మతు పనులను పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సంబంధిత శాఖల అధికారులతో రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించి, రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలు, పెండింగ్ పనుల పురోగతిపై చర్చించారు. జిల్లా కేంద్రంలోని రగుడు జంక్షన్, నాంపల్లి జంక్షన్ వద్ద రోడ్డు మరమ్మతులు చేపట్టాలని, చీర్లవంచ-వల్లంపట్ల రహదారి, వేములవాడ రెండవ బైపాస్ రోడ్డు, జిల్లాలోని పలు రహదారులకు అవసరమైన మరమ్మతు పనులను పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలల సమీపంలో అవసరమైన చోట రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని, విద్యార్థులను తరలించే పాఠశాల ఆటోలు, ప్రైవేట్ వాహనాల్లో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. నిబంధనల ఉల్లంఘనలపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రవాణా, పోలీసు, విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పీఎం రహత్ పథకం ద్వారా అర్హులైన రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో నగదు రహిత వైద్య చికిత్స అందేలా పోలీసు, రవాణా, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు వైద్య సహాయం అందించడంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, నిర్దేశించిన పనులను గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జాతీయ రహదారుల ఈఈ సురేష్, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఆర్ అండ్ బీ డీఈ శాంతయ్య, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, ఆర్టీసీ డీఎంలు, తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

ఇల్లంతకుంట, ప్రభాతవార్త

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని రకాల ఉచిత సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రేపాక గ్రామ సర్పంచ్ మల్లేశం సూచించారు.మంగళవారం మండలంలోని రేపాక జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు షూలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు అవసరమైన అనేక సౌకర్యాలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించాలని ఆకాంక్షించారు.విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరారెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామ కార్యదర్శి ప్రవీణ్, ఉపసర్పంచ్ మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

ఇల్లంతకుంట, ప్రభాతవార్త

రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు.మంగళవారం మండలంలోని వంతడుపుల,అనంతారం గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం తూకంలో కోతలు,తేమ శాతం నిర్ధారణలో మోసాలకు తావులేకుండా పారదర్శకంగా కొనుగోళ్లు చేపడతామన్నారు.ధాన్యం విక్రయించిన 24 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటరమణారెడ్డి, సర్పంచులు,అధికారులు,ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు

ఇల్లంతకుంట, ప్రభాతవార్త



మహిళలు క్యాన్సర్‌పై అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.మంగళవారం మండల కేంద్రంలోని జై శ్రీమన్నారాయణ ట్రస్ట్ భవనంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని ప్రారంభించారు.రొమ్ము, నోటి,గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు.వ్యాధిని తొలిదశలో గుర్తిస్తే మెరుగైన చికిత్స పొందవచ్చని డాక్టర్ కవ్వంపల్లి అనురాధ తెలిపారు.శిబిరంలో డాక్టర్లు సంధ్య,తేజస్విని,వినీలయ్,రేవతి,శంషద్,సాయి తేజ,సరస్వతి,శ్రీవల్లి,వినయ్,జిక్రియా,ఎండీ సుల్తానా,సీ.సర్వేశ్వర ప్రసాద్ తదితరులు పాల్గొని వైద్య సేవలందించారు.వలువురు ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఇల్లంతకుంట, ప్రభాతవార్త

మండలములోని వెల్జీపూర్ అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం పోషక ఆహార కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పోషకాహారం ప్రాముఖ్యత,పోషకాహార లోపాల వల్ల కలిగే సమస్యలు,వాటిని అధిగమించడంలో అంగన్వాడీ సేవల పాత్రపై అవగాహన కల్పించారు.పిల్లలు,గర్భిణులు,బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వివరించారు.పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రభుత్వం అందిస్తున్న అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి రామకృష్ణ,ఎంపీడీవో శశికళ,వైద్యాధికారి ప్రేమచంద్,పంచాయతీ కార్యదర్శి,అంగన్వాడీ సూపర్‌వైజర్ వీణ,అంగన్వాడీ టీచర్లు లక్ష్మి,మంజుల,ఆశా కార్యకర్తలు,తల్లులు,పిల్లలు పాల్గొన్నారు.

సిరిసిల్ల వార్త



జాతీయస్థాయి కబడ్డీ రిఫరీగా మదన్

సిరిసిల్ల అర్బన్ ప్రభాత వార్త:



బీహార్‌లోని పాట్నాలో జరగనున్న 52వ జూనియర్ జాతీయ బాలుర కబడ్డీ పోటీలకు రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన బాదావత్ మదన్ టెక్నికల్ ఆఫీసర్ (రిఫరీ)గా ఎంపికయ్యారు. తెలంగాణ నుంచి ఆయన ఈ అవకాశం దక్కించుకోవడం పట్ల క్రీడాభిమానులు, కబడ్డీ సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. సిరిసిల్ల సిద్ధార్థ హైస్కూల్‌లో పీఈటీగా పనిచేస్తున్న మదన్.. ప్రో కబడ్డీ లీగ్‌లోనూ సేవలందించడమే తన లక్ష్యమన్నారు. తన ఎదుగుదలకు సహకరించిన రాష్ట్ర, జిల్లా కబడ్డీ అసోసియేషన్ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మదన్‌ను పాఠశాల కరస్పాండెంట్ నాగుల సంతోష్, పలువురు క్రీడాకారులు అభినందించారు.

ట్రోబాల్ జిల్లా అధ్యక్షుడిగా దాసరి శివరాం

ఇల్లంతకుంట, ప్రభాతవార్త

సిరిసిల్ల జిల్లా ట్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఇల్లంతకుంట మండల కేంద్రానికి చెందిన దాసరి శివరాం మంగళవారం నియమితులయ్యారు.తెలంగాణ రాష్ట్ర ట్రోబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సమావేశంలో నూతన జిల్లా కార్యవర్గాన్ని ప్రకటించారు.ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ట్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దాసరి శివరాం,ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ అజీమ్,కోశాధికారిగా ఎండీ నవాబ్‌ను నియమించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రోబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి టి.కృష్ణారెడ్డి,కోశాధికారి షేక్ జమీల్‌తో పాటు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు,క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎబీవీపీ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

ఇల్లంతకుంట, ప్రభాతవార్త

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఇల్లంతకుంట మండల ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.మండల కన్వీనర్‌గా కాసుపాక విష్ణువర్ధన్,సహ కన్వీనర్లుగా ఋషివేంద్ర,అనూష,ప్రచార మాధ్యమాల కన్వీనర్‌గా సిద్ధార్థ,వసతి గృహాల కన్వీనర్‌గా శ్రీవర్ధన్,క్రీడల కన్వీనర్‌గా అభిషేక్,సేవా కార్యక్రమాల కన్వీనర్‌గా రాంచరణ్ ఎన్నికయ్యారు.ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంద వంశీకృష్ణ మాట్లాడుతూ..విద్యార్థుల్లో జాతీయ భావాలను పెంపొందిస్తూ,నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేయడంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. చీ

ప్రభుత్వ సాయంతో విద్యార్థులకు ఊరట

ఇల్లంతకుంట, ప్రభాతవార్త



స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ,ద్వితీయ సంవత్సర విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం సమకూర్చిన యూనిఫామ్స్, బూట్లు, సాక్సులు, బ్యాగులు, బెల్టులు, గుర్తింపు కార్డులు,విద్యాసామగ్రిని ప్రిన్సిపాల్ దేవరాజం మంగళవారం పంపిణీ చేశారు.ప్రభుత్వ సహాయం విద్యార్థుల చదువుకు తోడ్పడటంతోపాటు తల్లిదండ్రులపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నయీమోద్దీన్,మల్లారెడ్డి,యాదగిరి,లక్ష్మణ్,జీవన్,మమత తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించిన కౌన్సిలర్ అరవ లక్ష్మి

జగిత్యాల టౌన్,ప్రభాత వార్త..

జగిత్యాల మున్సిపల్ 22 వ వార్డులోని విద్యానగర్, బట్టీవాడ, శ్రీరామ థియేటర్ ఏరియా ప్రజలు నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని, మౌలిక వసతులు, పారిశుధ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని కౌన్సిలర్ ఆరవ లక్ష్మిఏసిఎస్ రాజు పేర్కొన్నారు. జగిత్యాల పట్టణంలోని 22వ వార్డులో మంగళవారం చేపట్టిన పారిశుద్ధ్య పనులు, చెత్త తొలగింపు కార్యక్రమాన్ని మున్సిపల్ కౌన్సిలర్ అరవ లక్ష్మి స్వయంగా పర్యవేక్షించారు. వార్డులోని పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి, డ్రైనేజీలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అరవ లక్ష్మి మాట్లాడుతూ ప్రజలు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయనని, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు. ముఖ్యంగా పారిశుద్ధం విషయంలో ఎక్కడా రాజీ పడే ప్రసక్తే లేదని,వార్డును



పరిశుభ్రంగా ఉంచడమే నా ప్రధాన లక్ష్యమన్నారు. చెత్త ఎక్కడా పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటానని,ప్రజలు కూడా తమ ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్తను రోడ్లపై, కాల్వల్లో వేయకుండా మున్సిపల్ సిబ్బందికి సహకరించాలన్నారు మీ వార్డు మీ బాధ్యతగా భావించి పరిశుభ్రతకు సహకరించాలని కోరుతున్నానని చెప్పారు.ఈ కార్యక్రమంలో జవాన్లు లక్ష్మీనారాయణ, నక్క రమేష్, మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఎంపీ ధర్మపురి అరవింద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నారపాక అశోక్

జగిత్యాల జిల్లాలో బీజేపీ ఎస్సీ మోర్చా బలోపేతంపై చర్చ

జగిత్యాల టౌన్, ప్రభాత వార్త. నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు, బీజేపీ నాయకులు ధర్మపురి అరవింద్ ను ఆయన నివాసం లో బీజేపీ ఎస్సీ మోర్చా జగిత్యాల జిల్లా అధ్యక్షులు నారపాక అశోక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లాలో భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చాను మరింత బలోపేతం చేయడంతో పాటు, దళిత సామాజిక వర్గాన్ని బీజేపీకి మరింత చేరువ చేసేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు .ప్రత్యేకంగా బీర్‌పూర్ మండలంలో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం, గ్రామస్థాయిలో పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేయడం, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం, మండల



అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై పలు అంశాలను ఎంపీ ధర్మపురి అరవింద్ దృష్టికి తీసుకెళ్లినట్లు నారపాక అశోక్ తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజల మధ్య పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని, పార్టీ బలోపేతానికి అవసరమైన మద్దతు, సహకారం అందిస్తామని ఎంపీ ధర్మపురి అరవింద్ భరోసా ఇచ్చినట్లు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో జగిత్యాల జిల్లాలో ఎస్సీ మోర్చాను మరింత బలోపేతం చేస్తూ, దళిత వర్గాల సంక్షేమం, అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ముందుకు సాగుతామని నారపాక అశోక్ తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్ల సేవలు ప్రశంసనీయం

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త: జగిత్యాల మండలం రూరల్ అంతర్గాం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం2 నూతన భవన ప్రారంభోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ప్రభుత్వం అందించే పోషకాహారాన్ని క్రమం తప్పకుండా అందిస్తూ వారి ఆరోగ్య స్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంలో అంగన్‌వాడీ టీచర్ల పాత్ర కీలకమైనదని కొనియాడారు.ప్రీస్కూల్ విద్య ద్వారా చిన్నారులను బడికి సంసిద్ధులను చేస్తూ వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నారని అభినందించారు.అలాగే ఎల్ నినో ప్రభావం,వాతావరణ మార్పుల దృష్ట్యా ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని, ఆహారం,ఆరోగ్య విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.అనంతరం మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ జగిత్యాల ప్రాజెక్ట్ సీడీపీవో జయప్రద మాట్లాడుతూ నూతన భవన నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే డాక్టర్



సంజయ్ కుమార్, సర్పంచ్ సోముల రమ్య శేఖర్ రెడ్డి,ఏఈ విజయ్, కాంట్రాక్టర్ నక్కల రవీందర్ గ్రామస్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమాదేవి,ఎంపీఓ రవి బాబు,ఎమ్మార్వో హకీమ్,డీటీ రమేష్, ఏసీడీపీఓ రాజశ్రీ,ఉప సర్పంచ్ బాలు గౌడ్, సూపర్వైజర్లు మమత,లావణ్య,ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీలత, రఘుపతి,ఏఎన్ఎమ్ ఇందిరా,సీఏలు పావని, విజయ,ఆశా కార్యకర్తలు విజయలక్ష్మి,సుగుణ, అశ్విని,అంగన్‌వాడీ టీచర్లు సరళ రాణి,ప్రవంతి, తల్లులు,పిల్లలు,గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఖేల్ ఇండియా వాలీబాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

అండర్17 బాలబాలికల సెలక్షన్ ట్రయల్స్ నిర్వహణ

జగిత్యాల టౌన్,ప్రభాత వార్త.. : ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఖేల్ ఇండియా అండర్17 బాలబాలికల వాలీబాల్ జట్ల ఎంపిక కోసం మంగళవారం కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించారు. అర్జున అవార్డు గ్రహీత రవికాంత్ రెడ్డి (2002) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపికల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులను ఎంపిక చేశారు. హైదరాబాద్‌లోని ఎల్.బి. స్టేడియంలో జరగనున్న ఖేల్ ఇండియా పోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారులను ఈ ట్రయల్స్ ద్వారా ఎంపిక చేసినట్లు, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన యువ క్రీడాకారులను గుర్తించి, రాష్ట్ర స్థాయిలో తమ ప్రతిభను చాటుకునేందుకు అవకాశాలు కల్పించడమే ఈ ఎంపికల ప్రధాన ఉద్దేశమని మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.సెలక్షన్ ట్రయల్స్‌కు హాజరైన క్రీడాకారులకు నిర్వాహకుల ఆధ్వర్యంలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అడహాక్ కమిటీ సభ్యులు పడాల అజయ్ గౌడ్, రాధాకృష్ణ రెడ్డి, పాము సత్యం, ఆరిఫ్, సంపత్, శ్రీనాథ్ రెడ్డి, ఠాగూర్, పీడీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ ఓబీసీ మోర్చా అర్బన్ మండల ప్రధాన కార్యదర్శిగా సల్ల రమేష్



జగిత్యాల టౌన్,ప్రభాత వార్త: జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామానికి చెందిన సల్ల రమేష్‌ను బీజేపీ జగిత్యాల అర్బన్ మండల ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు మండల ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ధనపునేని నరేష్ మంగళవారం ఓ ప్రకటనలో ప్రకటించారు.ఈ సందర్భంగా సల్ల రమేష్ మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ, బీజేపీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. బీసీల అభ్యున్నతికి కృషి చేస్తూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం పాటుపడతానని పేర్కొన్నారు.తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన బీజేపీ అగ్రనాయకులతో పాటు జిల్లా, జగిత్యాల అర్బన్ మండల నాయకులకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ నాయకులు తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని సల్ల రమేష్ పేర్కొన్నారు.



కోత దశలో కత్తెర పురుగు..

వరి రైతులు అప్రమత్తంగా ఉండాలి.. ..

పంటను నిత్యం పరిశీలించాలి





కొడిమ్యాల, ప్రభాతవార్త: కోత దశలో ఉన్న వరి పంటలో కట్‌వార్మ్ (కత్తెర పురుగు) పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి పి. జ్యోతి సూచించారు. ప్రస్తుతం అక్కడక్కడ కోత దశలో ఉన్న వరి పంటలో ఈ పురుగు ఉనికి గమనిస్తున్న నేపథ్యంలో రైతులు పంటను నిత్యం పరిశీలించాలని ఆమె తెలిపారు. ముఖ్యంగా కెఎన్ఎమ్ 1638 రకం వరి పంటలో కత్తెర పురుగు ఉధృతి కనిపిస్తున్నందున రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వరి పంటకు నీరు పెట్టడం నిలిపివేసిన తర్వాత ప్రతిరోజూ పొలాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని జ్యోతి పేర్కొన్నారు. వరి కంకులు కోసినట్లుగా తెగి నేలపై పడిపోవడం కనిపిస్తే కత్తెర పురుగు ఆశించినట్లు అనుమానించాలని తెలిపారు. వెంటనే వరి మొక్కల మొదళ్ల వద్ద లార్వా పురుగులు ఉన్నాయా లేదా పరిశీలించి, పురుగు ఉనికిని నిర్ధారించుకోవాలని సూచించారు. పురుగు లక్షణాలు కనిపించిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా వ్యవసాయ అధికారులను సంప్రదించి, వారి సూచనల మేరకు తగిన నివారణ చర్యలు చేపట్టాలని ఆమె పేర్కొన్నారు. పంట దశ, పురుగు ఉధృతిని బట్టి సరైన చర్యలు తీసుకోవడం ద్వారా నష్టాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. కోత దశలో ఉన్న వరి పంటను నిరంతరం పర్యవేక్షిస్తూ, కత్తెర పురుగు ఆనవాళ్లను గుర్తించిన వెంటనే స్పందించాలని మండల వ్యవసాయ అధికారి పి. జ్యోతి రైతులకు సూచించారు.

రోడ్డు ప్రమాద బాధితులు పీఎం రహత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ఎస్పీ అశోక్ కుమార్,

జిల్లాలోని 30 ఆసుపత్రుల్లో రూ.1.5 లక్షల వరకు నగదు రహిత వైద్య సేవలు



జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త: రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సకాలంలో వైద్య చికిత్స అందించి, వారి ప్రాణాలను కాపాడే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం రహత్ పథకంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, సూచించారు. జిల్లా పరిదిలో మొత్తం 30ఆసుపత్రుల్లో ఈ పథకం కింద వైద్య సేవలు అందు బాటులో ఉన్నాయని అర్హత నిబంధనలకు అనుగుణంగా రూ.1.5 లక్షల వరకు గరిష్ఠంగా ఏడు రోజుల పాటు నగదు రహిత వైద్య చికిత్స పొందవచ్చని పేర్కొన్నారు.రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు వీలైనంత త్వరగా వైద్య సహాయం అందించడం అత్యంత కీలకమని ప్రమాదంలో గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించి, అత్య వసర వైద్య చికిత్స అందేలా సహకరించాలని ప్రజలకు సూచిం చారు. ప్రమాద బాధితులకు సకాలంలో చికిత్స అందించడం ద్వారా ప్రాణాపాయ పరిస్థితులను నివారించవచ్చని తెలిపారు.రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం చేయడానికి ప్రజలు ముందుకు రావాలని, ప్రమాదం జరిగినప్పుడు క్షతగాత్రులను ఆదుకోవడంలో నిర్లక్ష్యం చేయవద్దని అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేసి పోలీసుల సహాయం పొందాలని సూచించారు.అదేవిధంగా, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని ఎస్పీ గారు సూచించారు.

ప్రతిభావంతులైన 15 మంది విద్యార్థులకు రూ.5 వేల చొప్పున స్కాలర్‌షిప్‌లు

కరీంనగర్ రూరల్: ప్రభాతవార్త

తెలంగాణ మైనారిటీ గురుకుల బాలుర పాఠశాల, కళాశాల సీఓఈలో శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో 8, 9, 10వ తరగతులకు చెందిన గత సంవత్సరం ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 15 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఒక్కొక్క విద్యార్థికి రూ.5,000 చొప్పున ఆర్థిక సహాయం అందించినట్లు తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాల సీఓఈ కరీంనగర్1 ప్రిన్సిపల్ వీర్ల మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ అధికారి మహమ్మద్ బిలాలోద్దీన్ అక్బర్ విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు



చదువులో మరింత రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ రీజినల్ ప్రాజెక్ట్ హెడ్ రాంబాబు, బ్రాంచ్ మేనేజర్ శంకర్, కలెక్షన్ హెడ్ శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపల్ వీర్ల మహేష్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలు పుట్టడం లేదని భార్య గొంతు పిసికి హత్య నిందితుడి అరెస్ట్

కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త :

పిల్లలు పుట్టడం లేదనే నెపంతో భార్యను దారుణంగా గొంతు పిసికి హత్య చేసిన భర్తను కరీంనగర్ రూరల్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారుపోలీసుల కథనం ప్రకారం... కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన దావు చంద్రకుమార్ మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ లేబర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి, స్వరూపకు వివాహమై ఏళ్ల గడుస్తున్నా పిల్లలు కలగకపోవడంతో భార్యపై కక్ష పెంచుకున్నాడు. విడాకులు ఇవ్వాలని కోరినప్పటికీ భార్య, ఆమె తల్లిదండ్రులు అంగీకరించకపోవడంతో ఆమెను వదిలించుకోవాలని పథకం పన్నాడు.ఈ క్రమంలో ఈ నెల 25వ తేదీ రాత్రి మద్యం సేవించి వచ్చిన చంద్రకుమార్, భార్యను తీసుకెళ్లాలని ఆమె కుటుంబ సభ్యులకు ఫోన్ చేశాడు. వారు రాకపోవడంతో తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. అదే రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో అద్దె ఇంట నిద్రిస్తున్న స్వరూప గొంతు పిసికి



దారుణంగా హత్య చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. మరుసటి రోజు మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పరారీలో ఉన్న నిందితుడు వేరే ప్రాంతానికి పారిపోయేందుకు తీగలగుట్టపల్లి రైల్వే స్టేషన్ వద్దకు వచ్చినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో రూరల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఏ. నిరంజన్ రెడ్డి తమ సిబ్బందితో కలిసి వెంటనే అక్కడికి చేరుకుని పారిపోతున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించి నట్లు సి ఐ తెలిపారు.

బైకును ఢీకొన్న ఇసుక లారీ..


ఒకరికి తీవ్ర గాయాలు

లారీ డ్రైవర్ అతివేగం, నిరక్ష ్యమ్లే.



. మానకొండూర్, ప్రభాతవార్త :

మానకొండూరు మండలంలోని అన్నారం గ్రామంలో ని పెట్రోల్ బంక్ సమీపంలో మానకొండూర్ వీణవంక ప్రధాన రహదారిపై బైకును ఇసుక లారీ ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలైనట్లు మంగళవారం తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మద్దికుంట గ్రామానికి చెందిన చిల్ల అనిల్, వీణవంక మండలం ఉప్పరపల్లి కి చెందిన కొలిపాక అంజి బైక్ పై కరీంనగర్ వైపు వెళ్తుండగా అన్నారంలో పచ్చునూర్ నుండి మానకొండూరు వైపుగా ఇసుక లారీ డ్రైవర్ అతివేగం నిరక్ష ్యంగా నడుపుతూ బైక్ ను ఢీకొనడంతో రోడ్డు మీద పడింది. దీంతో అంజికి తీవ్ర గాయాలు కాగా 108 వాహనంలో చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. ప్రధాన రహదారిపై నిత్యం ఇసుక లారీల రాకపోకలతో రోజుకో ప్రమాదం చోటు చేసుకుంటుందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మద్దికుంటలో రేపు జరిగే ఫంక్షన్ సామాన్ల కోసం బైక్ పై కరీంనగర్ వెళ్తుండగా రోడ్డు ప్రమాదం ఘటన చోటుచేసుకుంది.



డాక్టర్. గట్టు రమేష్ గౌడ్ జన్మదిన వేడుకలు

మానకొండూర్, ప్రభాతవార్త :

మండలం పరిధిలోని శంషాబాద్ గ్రామానికి చెందిన ప్రముఖ మెడికల్ ఫిజిసిస్ట్, రేడియేషన్ సేఫ్టీ ఆఫీసర్ (ఆర్ఎస్ఓ) డాక్టర్. గట్టు రమేష్ గౌడ్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్గొండ తిరుపతి గౌడ్ పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ రమేష్ గౌడ్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గట్టు సృజన్ గౌడ్, గట్టు సుభాష్ గౌడ్, గట్టు శ్రీనివాస్ గౌడ్, గట్టు అరవింద్ గౌడ్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గంజాయి ముఠా గుట్టు రట్టు

కొత్తపల్లి , ప్రభాతవార్త

కొత్తపల్లి మండలం కమాన్పూర్ శివారులోని భారత్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న పాడుబడ్డ ఇళ్లలో గంజాయి సేవిస్తూ, ఇతరులకు అమ్ముతున్న నలుగురు వ్యక్తులను ఈగల్ టీం , కొత్తపల్లి పోలీస్ వారు సంయుక్తంగా కలిసి పట్టుకున్నారు. వీరిలో చింతకుంట గ్రామానికి చెందిన మేకల యసాక్,ఇస్లావత్ శేఖర్ రాథోడ్ దత్తాత్రే కరీంనగర్ రామనగర్కు చెందిన వేములవాడ ఆశిష్ అను నలుగురిని పోలీసు వారు పట్టుకోగా వారి నుంచి 10 గ్రాముల గంజాయి మూడు సెల్ ఫోన్లు ఒక ఆటో ఒక ఎలక్ట్రికల్ బైక్ స్వాధీనం చేసుకున్నారు. మొత్తం ఐదుగురులో చింతకుంటకు చెందిన బషీర్ అనే వ్యక్తి పారిపోగా నలుగురు నిందితులను పట్టుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు కొత్తపల్లి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్ తెలిపినారు

ప్రభుత్వం విద్య వైద్యానికి ప్రాధాన్యం ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



ప్రభుత్వం విద్య వైద్యానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారుజగిత్యాల పట్టణ పొన్నాల గార్డెన్స్ లో జగిత్యాల అర్బన్ రూరల్ మండలం కి చెందిన 88మందికి సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన 29లక్షల విలువగల చెక్కులను,93 మంది ఆడబిడ్డలకు కళ్యాణ లక్ష్మీ ,షాది ముభారక్ పథకం లో భాగంగా మంజూరైన 93 లక్షల 5వేల రూపాయలు విలువగల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ఎమ్మెల్యే మాట్లాడుతూతెలంగాణ రాష్ట్రంలో విద్య వైద్యానికి అధిక ప్రాధాన్యం..అత్యధిక పల్లె దవాఖానలు జగిత్యాలకు మంజూరు అయ్యాయి.హెల్మెట్ వాడకం తో ప్రాణాపాయం తప్పుతుంది.అధికారులు ప్లాస్టిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలి..ప్రజల భాగస్వామ్యం కూడా తప్పనిసరి.రానున్న రోజుల్లో డంపింగ్ యార్డుల సమస్య తీవ్రం కానుంది...12 కోట్ల పైగా సీఎం సహాయ నిధి నిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి పాలన లో జగిత్యాల కు మంజూరు అయ్యాయి అన్నారు..ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి, పాక్స్ చైర్మెన్ లు దామోదర్ రావు,సందీప్ రావు,మాజీ జడ్పీటీసీ లు ముస్కు ఎల్లా రెడ్డి,పెండెం రాములు,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాల ముకుందం,మాజీ చైర్మెన్ నక్కల రవీందర్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బూరి మల్లేశం గౌడ్ ,జిల్లా మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు బొలిశెట్టి గంగారెడి,కట్ట రాజేందర్, ఎం లు హకీమ్,రామ్మోహన్,ఆర్ ఐ లు భూమయ్య ,నరేందం ,సర్పంచులు ,ఉపసర్పంచులు ,పట్టణ,మండల నాయకులు రెవెన్యూ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ వార్త

ఎలగందల్ జడ్పీహెచ్ఎస్ లో సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం ప్రారంభం

కొత్తపల్లి అక్టోబర్ 27 ప్రభాతవార్త



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని కరీంనగర్ జిల్లా విద్యాశాఖ అధికారి వై. తిరుపతిరావు ఎలగందల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు.ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ, విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు, చదువుపై ఏకాగ్రతను పెంపొందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటూ విద్యలో మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షి ంచారు. ఈ పథకం విజయవంతంగా అమలయ్యేందుకు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, సంబంధిత సిబ్బంది సమన్వయంతో కృషి చేస్తున్నారనీ అన్నారు కార్యక్రమంలో ఎంఆర్ఓ లక్ష్మి ,ఎలగందల్ సర్పంచ్ నిమ్మల అంజయ్య, సెక్టోరల్ అధికారులు, అశోక్ రెడ్డి, శ్రీనివాస్, జడ్పీహెచ్ఎస్ ఎలగందల్ ప్రధానోపాధ్యాయులు మరియు కొత్తపల్లి మండల విద్యాధికారి (ఎంఈఓ) తుమ్మ ఆనందం, ఉపాధ్యాయులు, హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులు రాము, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సమ్మె ఉధృతం

.15వ రోజుకు చేరిన నిరసన, కలెక్టరేట్ ముట్టడికి యత్నం.



కరీంనగర్,ప్రభాతవార్త

:జాతీయ ఆరోగ్య మిషన్ సిబ్బంది తమ సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన నిరసన దీక్షలు మంగళవారంతో 15వ రోజుకు చేరుకున్నాయి. కరీంనగర్ ఎన్‌హెచ్ఎం జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సమ్మె రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది.ఈ సందర్భంగా ఉద్యోగులు ప్రభుత్వ తీరుపై తమ నిరసనను తెలియజేస్తూ నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కోర్టు చౌరస్తా వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ ప్రధాన వీధుల మీదుగా కలెక్టరేట్ వరకు కొనసాగింది. అనంతరం అక్కడ బైఠాయించి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం సాక్షి గా అధికారులకు అందజేశారు.ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. గత కొంతకాలంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు పెంచడంతో పాటు, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ప్రధాన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా ఖిసమాన పనికి సమాన వేతనంఖి విధానాన్ని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.

ప్రాణాలను నిలబెట్టే రక్తదానమే మహాదానం

పోలీసుల త్యాగాలు చిరస్మరణీయం

ఏసిపి మాధవి

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:

అన్ని దానాల్లో కన్నా మనిషి ప్రాణాలను నిలబెట్టే రక్త దానం అత్యంత గొప్పదని హుజురాబాద్ ఏసిపి వాసంశెట్టి మాధవి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం హుజురాబాద్ పట్టణంలోని వివిఆర్ గార్డెన్ లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ ర్నొటాల సుహాసిని ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసిపి మాధవి మాట్లాడుతూ... దేశ రక్షణ, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు అమూల్యమైనవని కొనియాడారు. వారి త్యాగాలు ఎప్పటికీ చిరస్మరణీయమని అన్నారు. ప్రజల ప్రాణాలను, ఆస్తులను కాపాడే క్రమంలో తమ కుటుంబాలను సైతం వదిలి, కంటి మీద కునుకు లేకుండా విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన మహనీయులు మన పోలీస్ అమరవీరులని ఆమె స్మరించుకున్నారు. చైర్ పర్సన్ సుహాసిని మాట్లాడుతూ... సమాజంలో ప్రతి ఒక్కరూ ఎలాంటి భయాందోళనలు లేకుండా స్వేచ్ఛగా, ప్రశాంతంగా జీవిస్తున్నారంటే దానికి పోలీసు అధికారులు, సిబ్బంది అహర్నిశలు చేస్తున్న శ్రమే కారణమని స్పష్టం చేశారు. ప్రజల రక్షణ కోసం రాత్రింబవళ్లు శ్రమిస్తూ, శాంతిభద్రతలను కాపాడుతున్న



పోలీస్ వ్యవస్థ పనితీరు అత్యంత గొప్పదని ప్రశంసించారు. ఆపదలో ఉన్న ఒక ప్రాణాన్ని నిలబెట్టే రక్తదానం చేయడం ద్వారా అమరవీరుల స్మృతికి సార్థకత చేకూరుతుందని, యువత పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చి రక్తదానం చేయడం అభినందనీయమని ఆమె తెలిపారు. ప్రజా ప్రతినిధులు, పోలీసుల పిలుపు మేరకు ఈ శిబిరంలో మొత్తం 83 మంది స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐలు టి. కరుణాకర్, వీరబత్తిని శ్రీనివాస్, ఎస్. రామకృష్ణ, పులి వెంకట్, ఎస్ఐలు కొత్తపల్లి రవి, కృష్ణారావు, కే. శేఖర్ రెడ్డి, తిరుపతి, క్రాంతి, స్వాతి, వైద్య బృందం సభ్యులు డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, సుజాత, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకుడు శనిగరం తరుణ్, ఇతర ప్రజా ప్రతినిధులు, మార్నింగ్ వాకర్స్ ఫ్రెండ్స్ తదితరులు పాల్గొన్నారు.

హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి అస్తవ్యస్తం

సిపిఐ నేత మర్రి వెంకటస్వామి

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:

హుజురాబాద్‌లోని 100 పడకల ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి అస్తవ్యస్త పాలనకు నిలయంగా మారిందని సిపిఐ సీనియర్ నేత, న్యాయవాది మర్రి వెంకటస్వామి మండిపడ్డారు. మంగళవారం ఆయన ఆసుపత్రిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... దవాఖానలో రోగులకు కనీస వైద్యం, సౌకర్యాలు అందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగుల ప్రాణాలతో చెలగాటం.. ప్రైవేట్‌కు మళ్లింపు...నిబంధనల ప్రకారం ఆసుపత్రిలో 37 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా, రికార్డుల్లో 18 మంది మాత్రమే ఉన్నారని, అందులోనూ విధులకు కేవలం ఏడుగురే హాజరవుతున్నారని ఆయన ఆరోపించారు. గైనకాలజీ విభాగంలో స్పెషలిస్టులకు బదులుగా వేరే వైద్యుడితో ఓపి నడిపిస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. వైద్య పరీక్షల పేరిట కొందరు వైద్యులు కమీషన్లకు కక్కుర్తి పడి రోగులను ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్లు, ప్రైవేట్ దవాఖానలకు మళ్లిస్తున్నారని ఆరోపించారు. ఆసుపత్రిలో కనీసం తాగునీటి సదుపాయం కూడా లేకపోవడంతో రోగులు నీళ్ల



కొనుగోలు చేసుకోవాల్సి వస్తోందని, మధ్యాహ్న భోజనంలోనూ నాణ్యత లోపించిందని ఆవేదన వ్యక్తం చేశారు. సూపరింటెండెంట్ పై చర్యలు తీసుకోవాలి...విధుల పట్ల నిరక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్‌తో పాటు సంబంధిత సిబ్బందిపై విచారణ జరిపి తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని మర్రి వెంకటస్వామి డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని వెంటనే ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసి, పేదలకు మెరుగైన ఉచిత వైద్యం అందేలా తగిన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై అవగాహన

హుజురాబాద్ టౌన్, ప్రభాత వార్త:

హుజురాబాద్ మండలం చెల్పూర్ గ్రామంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో భిబేటీ బచావో బేటీ పఢావోభి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ ఇరుగంటి శైలజ, బాలల హక్కుల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ మాడుగుల రమేష్ ఆధ్వర్యంలో ఈ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జెండర్ స్పెషలిస్ట్ ఇరుగంటి శైలజ బాలికలకు భిగుడ్ టచ్ బ్యాడ్ టచ్‌భి పై ప్రత్యేక అవగాహన కల్పించారు. మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా వినియోగంతో వచ్చే ఇబ్బందులను, జిల్లాలో జరిగిన కొన్ని యదార్థ సంఘటనలను ఉదాహరణలుగా వివరించారు. విద్యార్థులు ధైర్యంగా ఉండాలని, ఆపద ఎదురైనప్పుడు ఎలా ఫిర్యాదు చేయాలో సూచించారు. సోషల్ వర్కర్ మాడుగుల రమేష్ మాట్లాడుతూ... బాలురు మాదకద్రవ్యాలకు దూరంగా



ఉండాలని హెచ్చరించారు. తమ వయసు కంటే పెద్దవారితో స్నేహం చేయడం వల్ల కలిగే నష్టాలను వివరించిన ఆయన, అత్యవసర సమయాల్లో 1098 నంబర్‌కు డయల్ చేయాలని తెలిపారు.విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండి, కేవలం చదువు పైనే దృష్టి సారించాలని ఎంఈఓ విడపు శ్రీనివాస్ హితవు పలికారు. ఇతర విషయాల్లో అనవసరంగా జోక్యం చేసుకోకూడదని సూచించారు. జిల్లా కేంద్రం నుంచి వచ్చి విద్యార్థులకు చక్కటి అవగాహన కల్పించిన అధికారులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇనగంటి అనురాధ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. రమాదేవి, ఉపాధ్యాయులు, సీఆర్పీలు రమేష్, సుధామన్, విద్యార్థులు పాల్గొన్నారు.

తనుగుల గ్రామాన్ని సందర్శించిన పలు రాష్ట్రాల గ్రూప్‌వన్ అధికారులు

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;

జమ్మికుంట మండలంలోని తనుగుల గ్రామాన్ని మంగళవారంగ్రూప్ వన్ సాధించిన పలు రాష్ట్రాలకు చెందిన గ్రూప్ వన్ అధికారులు సందర్శించారు.ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధిస్తున్న విధానమును తెలుసుకోవడంతో పాటు అంగన్వాడి సెంటర్ నిర్వాహనను పరిశీలించారు.అంగన్వాడి సెంటర్లో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న తీరు అంగన్వాడి సెంటర్ ద్వారా గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న పోషక పదార్థాలను గురించి అడిగి తెలుసుకున్నారు.ఏ



విధంగా రైతు వేదికను పరిశీలించి గ్రామంలో ఉన్న ప్రాథమిక సహకార సంఘం ద్వారా లబ్ధి పొందినటువంటి రైతులకు సంబంధించిన అంశాలను గురించి తెలుసుకోవడంతో పాటు గ్రామంలో వివిధ రకాల అభివృద్ధి పనులను నిశితంగా పరిశీలించారు. తెలంగాణ, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, బీహార్ ,తమిళనాడు ప్రాంతాలకు చెందిన గ్రూప్ వన్ ఆఫీసర్లను గ్రామ సర్పంచ్ కిరణ్ గౌడ్ పాలకవర్గం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

కనగర్తి గ్రామంలో రెండు వీవో భవనాల నిర్మాణ పనులు ప్రారంభం..

.ఇల్లందకుంట, ప్రభాతవార్త:

కరీంనగర్ జిల్లా ఇల్లందుకుంట మండలం కనగర్తి గ్రామంలో ఎన్ఆర్జీఎస్ నిధుల కింద మంజూరైన రెండు వీవో భవనాల నిర్మాణ పనులను మంగళవారం గ్రామ సర్పంచ్ రామంచ సంపత్ ప్రారంభించారు.



గ్రామంలో మహిళా సంఘాలకు అవసరమైన వసతుల కల్పనలో భాగంగా ఈ భవనాల నిర్మాణ పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గం, మహిళా సంఘాల సభ్యులు పలువురు పాల్గొన్నారు.

హుజూరాబాద్ వార్త

స్కానింగ్ సెంటర్ల ఆకస్మిక తనిఖీ..



. లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:

హుజురాబాద్ పట్టణంలోని పలు స్కానింగ్ సెంటర్లను జిల్లా మాతా శిశు సంరక్షణ ప్రత్యేక అధికారి డాక్టర్ సనా జావేరియా, హుజురాబాద్ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రభుదాస్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సెంటర్లలోని రిజిస్టర్లు, రికార్డులను వారు క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం సెంటర్ల నిర్వాహకులకు పలు కీలక సూచనలు చేశారు. ప్రతి ఒక్క స్కానింగ్‌కు సంబంధించిన రిఫరల్ స్లిప్పులను తప్పనిసరిగా ఫైల్ చేయాలని, విధిగా ఫిఫామ్ఎఫ్‌భిలను మెయింటెన్ చేస్తూ ప్రతి నెలా ఆడిట్ చేయించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని స్పష్టం చేశారు. గర్భిణులకు స్కానింగ్ చేసిన తర్వాత కడుపులోని బిడ్డ ఆడ, మగ అనే విషయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించరాదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించి లింగ నిర్ధారణకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వారు స్పష్టం చేశారు

రైతు వేదికలో కేత్ బచావో అభియాన్ కార్యక్రమం

హుజురాబాద్ టౌన్, ప్రభాత వార్త:



హుజురాబాద్ పట్టణంలో శివారులోని కేసి క్యాంపులో గల రైతు వేదిక రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్, వ్యవసాయ శాఖ, జమ్మికుంట కెవికె ఆధ్వర్యంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నేలల రక్షణ పై రైతులు తీసుకోవాల్సిన చర్యలు, పంటల మార్పిడి తదితర అంశాలపై అధికారులు రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ ర్నొటాల సుహాసిని, కౌన్సిలర్లు సమ్మయ్య, సునీత, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సునీత, కెవికె శాస్త్రవేత్త ప్రశాంతి, సెరికల్చర్ ఏడి వెంకన్న, మండల వ్యవసాయ అధికారి చందా భూమిరెడ్డి, ఏఈఓ నిఖిల్, గోస్కుల వివేక్, రైతులు పాల్గొన్నారు.

జమ్మికుంట కూరగాయల మార్కెట్ ను సందర్శించిన వొడితల ప్రణవ్

కూరగాయల రైతులకు ఆత్మీయ పలకరింపు



జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త

జమ్మికుంట పట్టణంలోని కూరగాయల మార్కెట్ ను మంగళవారం హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ సందర్శించారు.ఈ సందర్భంగా కూరగాయలు పండించే రైతులను ఆత్మీయంగా పలకరించి ముచ్చటించారు.కూరగాయలు అమ్మే సమయంలో పలు సమస్యలు ఎదురవుతున్నాయని వాటిని పరిష్కారించాలని కోరగా తప్పకుండా పరిష్కరిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో జమ్మికుంట కాంగ్రెస్ పార్టీ నాయకులు దేశిని కోటి, సాయిని రవి,గూడెపు సారంగపాణి, శ్రీపతి నరేష్ గౌడ్,దిడ్డి రామ్మోహన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలకు సాకారం

రామగుండంలో ఇందిరమ్మ ఇళ్ల పండుగ.. కుటుంబాల్లో ఆనందం!

ఎన్టీపీసీ,ప్రభాతవార్త: రామగుండం నియోజకవర్గంలో 1100 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మంగళవారం ఎన్టీపీసీలోని కాకతీయ కళ్యాణ మండపంలో పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అర్హులైన పేద కుటుంబాలకు ఇళ్లతో భరోసా కల్పిస్తామని, మొదటి విడతలో ఇళ్లు మంజూరు కాని అర్హులకు రెండో విడతలో అవకాశం కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.రామగుండం సమగ్ర అభివృద్ధితో పాటు సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తామని, రహదారులు, తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి నియోజకవర్గ రూపురేఖలు మారుస్తామని పేర్కొన్నారు.కార్యక్రమంలో మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, మున్సిపల్ కమిషనర్ అరుణశ్రీ, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు ఎం.డి. ముస్తఫా, కార్పొరేటర్లు, నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.






ఇన్ఫెక్షన్ల నివారణకు పరిశుభ్రత తప్పనిసరి

పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో కాయకల్ప ప్రత్యేక ప్రచారంలో వైద్య సిబ్బందికి సూచనలు

పెద్దపల్లి, ప్రభాతవార్త: ఆసుపత్రిలో ఇన్ఫెక్షన్లను నియంత్రించి రోగులకు పరిశుభ్రమైన వాతావరణంలో వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది నిర్దేశిత ప్రమాణాలను పాటించాలని అధికారులు సూచించారు. భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు పెద్దపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో నిర్వహించిన కాయకల్ప ప్రత్యేక ప్రచార కార్యక్రమానికి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ నేతృత్వం వహించారు. నర్సింగ్ సూపరింటెండెంట్, ఇన్ఫెక్షన్ కంట్రోల్ నర్స్ (ఐసీఎన్), క్వాలిటీ మేనేజర్, ఆర్ఎంఓ తదితరుల సమక్షంలో పరిశుభ్రత చర్యలు చేపట్టారు. చేతులు సక్రమంగా కడుక్కోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, వైద్య పరికరాలను శుభ్రపరచడం, క్రిమిసంహారక ప్రక్రియలు, పరికరాల స్టెరిలైజేషన్, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై సిబ్బందికి వివరించారు. ఆసుపత్రి అంతస్తులు, మరుగుదొడ్ల పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ వ్యక్తిగత పరిశుభ్రతను అలవర్చుకోవాలని సూచించారు.

గూడెంలో కర్ర సదయ్య మృతికి ఏఐటీయూసీ సంతాపం.

ఓదెల,ప్రభాతవార్త: ఓదెల మండలం గూడెం గ్రామ హమాలి వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కర్ర సదయ్య అకాల మృతికి ఏఐటీయూసీ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ తన ప్రగాఢ సంతాపం తెలిపారు. హమాలి కార్మికుల హక్కుల కోసం కృషి చేసిన మంచి నాయకుడిని కోల్పోవడం కార్మిక సంఘానికి తీరని లోటని పేర్కొన్నారు. సదయ్య కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.హమాలి కార్మికులకు ప్రమాద బీమా, జనశ్రీ బీమా వంటి సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. హమాలి కార్మికుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర ప్రమాద బీమా సౌకర్యం కల్పించడంతో పాటు ప్రత్యేక సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని కడారి సునీల్ డిమాండ్ చేశారు.



యాసంగిలో వరికి బదులుగా రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు చేయాలి

జూలపల్లి,ప్రభాతవార్త: జూలపల్లి మండలం వడ్కపూర్ గ్రామంలో మంగళవారం రైతు వేదిక నందు కేతి బచావో అభియాన్ కార్యక్రమం మండల వ్యవసాయ అధికారిణి టి . ప్రత్యూష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాగు భూముల్లో భూసార పరిరక్షణకు పంట వ్యర్థాలను కాల్చకుండా పంట ఆవశేషాలను నేలలో కలియదున్నడం వల్ల నేలలోని సేంద్రియ కర్బనం పెరిగి నేల సారవంతం అవుతుందని,అంతేకాకుండా నేల ఆరోగ్యం కోసం పశువుల పేడ, పచ్చిరొట్ట ఎరువులు వేయాలని, యాసంగి సీజను కి ఎల్ నినో ప్రభావం వలన వచ్చే నీటి ఎద్దడిని తట్టుకునేందుకు వరికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలు అయినా మినుములు, పెసర్లు, శనగ, వేరుశనగ, మొక్కజొన్న, జొన్న, నువ్వులు, పొద్దు తిరుగుడు, పంటలు సాగు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కీచులాటపల్లె సర్పంచ్ మెండె తిరుపతి,తేలుకుంట ఉప సర్పంచ్ దావు సంపత్ రెడ్డి,ఎఈఓ లు జి. కిరణ్మయి,టి. రాకేష్,జి. రాజేష్ రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వరి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి



ఓదెల,ప్రభాతవార్త: ఓదెల మండలంలో వెంటనే వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులను ఆదుకోవాలని బీజేపీ ఓదెల మండల అధ్యక్షులు, కొలనూర్ మాజీ ఎంపీటీసీ కారెంగుల శ్రీనివాస్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఓదెల మండల వ్యాప్తంగా సుమారు 12 వేల ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేశారని, కోతలు ప్రారంభమై వారం రోజులు గడుస్తున్నప్పటికీ ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.కొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు స్థలం లేక ఇళ్ల వద్ద, రోడ్లపైనే ఆరబెట్టుకోవాల్సి న పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు వెంటనే స్పందించి ఓదెల మండలంలోని అన్ని గ్రామాల్లో అన్ని వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కారెంగుల శ్రీనివాస్ కోరారు.

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

ఓదెల,ప్రభాతవార్త: పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా పొత్కపల్లి పోలీస్ ల ఆధ్వర్యంలో ఓదెల మండలంలో పొత్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోలీస్ అమరవీరుల సంస్మరణ ఆవశ్యకత మరియు పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు యెబుసి శ్రీనివాస్ అలాగే పొత్కపల్లి పోలీస్ అధికారులు రాజేందర్, అశోక్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోలీస్ శాఖలో వినియోగిస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రజలకు అందిస్తున్న వివిధ పోలీస్ సేవలు, డయల్ 112, షీ టీమ్స్, సైబర్ క్రైమ్, డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల కలిగే నష్టాలు తదితర అంశాలపై అలాగే మైనర్లు వాహనాలు నడపకూడదని, మోటార్ వాహన చట్టాలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో విద్య ఎంతో ముఖ్యమైనదని, విద్యార్థులు కష్టపడి ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగి, తల్లిదండ్రులకు అలాగే సమాజానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సంజీవ్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పెద్దపల్లి వార్త





పారిశుధ్య కార్మికుల మధ్య జన్మదిన వేడుకలు.. సేవకుల సమక్షంలో కేక్ కటింగ్

గోదావరిఖని,ప్రభాత వార్త: బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు, మంథని నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి రేండ్ల సనత్‌కుమార్ జన్మదిన వేడుకలను 8వ కాలనీలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమాజ పరిశుభ్రత కోసం శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికుల సమక్షంలో కేక్ కట్ చేసి, వారికి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు సనత్‌కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని, మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.బీజేపీ మండల అధ్యక్షుడు ఆకుల శశికుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మూకిరి రాజు, ఆకుల కుమార్‌గౌడ్, బండి రంజిత్, జంజర్ల శ్రీనివాస్, లింగం నాయక్, గంధం శంకర్, దూడపాక కుమార్, అనిల్‌కుమార్, రామంచ శ్రావణ్, భూక్య సమ్మయ్య నాయక్, ఇస్లావత్ సతీష్ నాయక్, రొడ్డ విజయ్, సంకే రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. పారిశుధ్య కార్మికులు పోచమల్లు, లింగయ్య, నాగరాజు, యశ్వంత్, మల్లమ్మ, భాగ్యమ్మ, వీరమ్మ హాజరయ్యారు.

విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందించాలి....

పెద్దపల్లి జిల్లా ఏఎంవో డా. షేక్.. డీవైఎస్ఓ సురేష్

సుల్తానాబాద్, ప్రభాతవార్త: విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలని పెద్దపల్లి జిల్లా ఏఎంవో డా. షేక్, డీవైఎస్ఓ సురేష్ సూచించారు. మంగళవారం



సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన పీఎం శ్రీ పాఠశాలల జిల్లా స్థాయి క్రీడా పోటీలకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపైనా ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదల, జట్టుగా పనిచేసే లక్షణాలను అలవర్చుతాయని పేర్కొన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు.పాఠశాల స్థాయి నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించుకుంటే భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలని కోరారు.పోటీల్లో భాగంగా మొదటి రోజు బాలికలకు అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ క్రీడలను నిర్వహించారు. పెద్దపల్లి జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మణ్, నోడల్ ఆఫీసర్ టీ. శోభారాణి, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, పేట రాష్ట్ర ఉపాధ్యక్షులు కొమురోజు శ్రీనివాస్,పేట జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దాసరి రమేష్, సురేందర్, పీడీలు ప్రణయ్, జావీద్, వెంకటేష్, సదయ్య, డా.రవి, ప్రసాద్, శైలజ, ఖాజాబీ, అజ్జు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూసార పరిరక్షణ

సుస్థిర వ్యవసాయానికి పునాది

సహాయ వ్యవసాయ సంచాలకులు ప్రియదర్శిని

చొప్పదండి,ప్రభాతవార్త: మండల పరిధిలోని గుమ్లాపూర్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా ఖేత్ బచావో అభియాన్ 2026 లక్ష్యాలను వివరిస్తూ రైతులకు భూసార పరిరక్షణ, ఎరువుల సమతుల్య వినియోగం, పంట అవశేషాల నిర్వహణ, ప్రకృతి వ్యవసాయం, నీటి పొదుపు, ప్రత్యామ్నాయ పంటల సాగు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ముందుకు సాగాలని అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్త శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. చొప్పదండి వ్యవసాయ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకురాలు ప్రియదర్శిని మాట్లాడుతూ, భూసార పరిరక్షణ సుస్థిర వ్యవసాయానికి పునాది అని పేర్కొన్నారు. కుమార్ మాట్లాడుతూ, నేలలోని పోషకాల స్థితిని తెలుసుకోవడానికి భూసార పరీక్షలు ఎంతో ముఖ్యమని తెలిపారు. పంట అవసరాలు, నేల స్వభావం, నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకొని ఎరువులను వినియోగించాలని



సూచించారు. జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రానికి చెందిన కీటక శాస్త్రవేత్త శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, సేంద్రియ పదార్థాల వినియోగం, పంటల మార్పిడి, నీటి సమర్థ వినియోగం వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, సాగు ఖర్చులను తగ్గించుకునే పద్ధతులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రైతులు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను పాటించాలని, ఖేత్ బచావో అభియాన్ ప్రధాన లక్ష్యం భూమి ఆరోగ్యాన్ని పరిరక్షించడం, వ్యవసాయ వనరులను సమర్థవంతంగా వినియోగించడం, రైతులకు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. రైతులు భూసార పరీక్షలు, సమతుల్య ఎరువుల వినియోగం, పంటల వైవిధ్యీకరణ, ఉద్యాన పంటలు ఆయిల్ పామ్, డ్రిప్ స్ప్రింక్లేర్ ,మల్చింగ్ , గూర్చి వివరించారు, ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొనారు



చొప్పదండి సహకార సంఘాన్ని సందర్శించిన

ఎన్ఐఆర్డిపిఆర్ విద్యార్థుల బృందం

చొప్పదండి,ప్రభాతవార్త:

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ చొప్పదండిని ఎన్ ఐ ఆర్ డి పి ఆర్ సంబంధించిన ఐదుగురు విద్యార్థుల బృందం మంగళవారం సందర్శించింది. గ్రామీణ ప్రాంతాలలో సహకార వ్యవస్థ ఎలా పనిచేస్తుంది అన్న దాని గురించి నేర్చుకోవడానికి ఈ బృందం చొప్పదండి సహకార సంఘానికి వచ్చిందని చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా అభివృద్ధిలో పయనిస్తున్నటువంటి ఉత్తమ సహకార సంఘాలను సందర్శించాలన్న ఉద్దేశంతో రాజేంద్రనగర్ లోని ఈ విద్యార్థులు చొప్పదండి సహకార సంఘాన్ని సందర్శించారు. సంఘ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాసరెడ్డి విద్యార్థులకు సహకార సంఘం రైతులకు అందిస్తున్న వివిధ రకాల సేవలను సవివరంగా వివరించారు. సంఘ సభ్యులకు కేవలం అప్పులు ఇవ్వడం వసూలు చేయడమే కాకుండా రైతులకు అవసరమైన ఎరువులు పురుగు మందులు బియ్యం అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. చొప్పదండి చుట్టుపక్కల మండల ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వ పథకమైన జన ఔషాదీ కేంద్రాన్ని ప్రారంభించి అతి తక్కువ ధరలకే మండల ప్రజలకు వారి అవసరాలకు మందులు అందించడం జరుగుతుందని తెలిపారు.

సభ్యుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని 2033 సంవత్సరంలో పెట్రోల్ పంపు కూడా సంఘం ద్వారా ఏర్పాటు చేశారని తెలిపారు. చొప్పదండి పట్టణ శివారులో సంఘానికి ఉన్న 5 ఎకరాల స్థలంలో కేంద్ర ప్రభుత్వ పథకం అయినటువంటి పీఎం కుసుమ్ ద్వారా 1 మెగా వాట్ సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులు పూర్తి అవుతున్నాయని మరో 15 రోజుల్లో దీని ద్వారా ఉత్పత్తి ప్రారంభమవుతుందని తెలిపారు, దీని ద్వారా సంఘానికి అదనంగా 5 లక్షల వరకు ఆదాయం ప్రతినెల వస్తుందని తెలిపారు. రానున్న ఎల్ నివో ప్రభావంతో ప్రభుత్వం వరి పంట విస్తీర్ణం తగ్గించాలని సూచించడంతో పప్పు దినుసులు పండించే రైతులను గుర్తించి సంఘం తరఫున తగు ప్రోత్సాహకాలు అందించడానికి కూడా ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

దీనికి సంబంధించి త్వరలో విధివిధానాల రూపొందించి రైతులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. రైతులు పండించిన పప్పు దినుసులను సంఘమే కొనుగోలు చేసి వారికి మార్కెట్ ధర కంటే ఎక్కువ డబ్బులు చెల్లించేందుకు ఏర్పాటు చేస్తున్నామని అలాగే సంఘం సేకరించిన పప్పు దినుసులను దాల్ మిల్ ఏర్పాటు చేసి పప్పులుగా మార్చి సంఘం బ్రాండ్ తో ప్రజలకు అమ్మడానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి కళ్లెం తిరుపతిరెడ్డి, కౌన్సిలర్ రాజేందర్ రెడ్డి, నాయకులు మునిగాల సుధాకర్, సంఘ సిబ్బంది, తిరుపతి, శ్రీ పాల్, కావ్య, శ్రీకాంత్, రాజమోళి, మమత తదితరులు పాల్గొన్నారు.

సదరం శిబిరంలో

అంగవైకల్యంకు మొండి చేయి?

కాళ్లు చేతులు విరిగినా కనికరించని వైనం!

అధికారుల నిర్వాకంతో పెన్షన్ కు నోచుకోని వికలాంగుడు



మల్యాల, ప్రభాతవార్త: ఆరు నెలల క్రితం ట్రాక్టర్ ప్రమాదంలో కాళ్లు చేతులు విరిగి పేగులు బయటపడి చివరికి అప్పు సప్పుచేసి ఆస్పత్రిలో చేరి ప్రాణా లతో బయట పడిన వ్యక్తికి అంగవైకల్యం పరీక్షించి సర్టిఫికెట్ ఇవ్వాల్సిన అధికారులు నిరాకరించిన సంఘటన ఇది, మంగళవారం మల్యాల మండ్నల మానాల కు చెందిన శివరాత్రి రెడ్డి అనే వ్యక్తి వృత్తి పని లో భాగంగా కంకర కొట్టి జీవిస్తుండగా, ఆరు నెల క్రితం ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి చేతులు కాళ్లు అనేక చోట్ల విరిగి ప్రాణాపాయ స్థితి నుండి బయటపడి పని చేసుకోలేక మంచానికే పరిమితమయ్యాడు, తనకు చేతులు కాళ్లు విరిగి, పని చేసుకునేంత శక్తి లేక నిస్సహాయ స్థితిలో నరకయాతన అనుభవిస్తున్నాడు , ఈ క్రమంలో తనకు కనీసం వికలాంగుల సర్టిఫికెట్ వస్తె కనీసం ప్రభుత్వం అందించే పెన్షన్ ఆధారం తోనైనా బతు కొచ్చున్న ఆశతో సదరం సర్టిఫికెట్ పొందుటకు బాధితుడు రెడ్డి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోగా, జగిత్యాల ఏరియా ఆసుపత్రిలో మంగళవారం స్లాట్ బుకింగ్ నమోదయింది, దీంతో ఎంతో ఆశతో జగిత్యాల ఆసుపత్రికి వెళ్లిన రెడ్డికి చేదు అనుభవం ఎదురైంది, తన ఆస్పత్రి సర్టిఫికెట్లు చూపించినప్పటికీ సదరం సర్టిఫికెట్ కు నీవు రిజెక్ట్ అయినట్లు అధికారులు పేర్కొనడంతో కంగుతిన్నాడు, తాను నడవలేని పరిస్థితిలో అంగవైకల్యంతో అవస్థలు పడుతున్నప్పటికీ తనకు సదరం సర్టిఫికెట్ ఇవ్వకపోవడం పట్ల ఆయన తీవ్ర ఆవేదనకు గురయ్యాడు, సదరం సర్టిఫికెట్ పొందుతూనే పెన్షన్ కు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నందున కనీసం సర్టిఫికెట్ ఇవ్వడానికి అధికారులు కనికరించకపోవడం పట్ల ఆయన తీవ్ర మనోవేదకు గురయ్యాడు, బాధితుడు శివ రాత్రి రెడ్డికి సదరం సర్టిఫికెట్ ఇప్పించాలని ఎమ్మెల్సీ వెంకట్ ను కూడా బాధితుడు వేడుకోగా ఆయన కూడా అధికారులకు ఆదేశించినట్లు తెలిసింది, ఇదిలా ఉండగా బాధితుడు రెడ్డికి అధికారులు వెంటనే స్పందించి సదరం సర్టిఫికెట్ అందజేసి న్యాయం చేయాలని సర్పంచ్ పాపారావు కోరారు,

మల్యాల పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్

మల్యాల ,ప్రభాతవార్త: మల్యాల పోలీస్ స్టేషన్‌లో మంగళవారం విద్యార్థుల ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా, విద్యార్థులకు పోలీస్ స్టేషన్ పనితీరు, పోలీసు సిబ్బంది విధులు, బాధ్యతలు, నేర పరిశోధనలో అనుసరించే విధానాల పై వివరించారు,అంతేకాకుండా, శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, మరియు ప్రజల రక్షణలో పోలీసుల పాత్ర గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు ,ఈ సందర్భంగా మల్యాల ఎస్సై సందీప్ మాట్లాడుతూ, విద్యార్థులకు పోలీసు వ్యవస్థ పనితీరుతోపాటు పోలీసులకు ప్రజలకు మధ్య సత్సంబంధాల పై విద్యార్థి దశ లో అవగాహన చెందాలన్నారు,



చొప్పదండి వార్త



మానవత్వానికి మారుపేరుగా

నిలిచిన చొప్పదండి యువత

చొప్పదండి,ప్రభాతవార్త: పోలీసుల అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం చొప్పదండి ఎస్ఐ రాజ్ కుమార్ పిలుపుమేరకు కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో చొప్పదండి కాంగ్రెస్ యువనేత వడ్లూరి అజయ్ కుమార్ ఆధ్వర్యంలో 20 మందికి పైగా యువకులు స్వచ్ఛందంగా వెళ్లి రక్తదానం చేశారు. యువత రక్తదానం చేసి మరో 20 మందికి ప్రాణదాతలుగా నిలిచారు. యువత చేసిన రక్తదానం మరొకరి జీవితానికి ప్రాణదానంగా నిలవడం అభినందనీయమని చొప్పదండి పోలీసులు అభినందించారు. చెడు వ్యసనాలకు, చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండి ఇలాంటి స్వచ్ఛంద కార్యక్రమాల్లో పాలుపంచు కొని వారి ఉన్నతిని చాటుకోవాల్సిందిగా అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. రక్తదానం చేసి మానవత్వానికి మారుపేరుగా చొప్పదండి యువత నిలవ డం గర్వకారణం అని అజయ్ పేర్కొన్నారు. నేటి సమాజా నికి ఇలాంటి యువతే సైనికుల ముందు ఉండి దేశ ప్రగతిని, ప్రజల ప్రాణాలను కాపాడడానికి సంయుక్తుల వుతారని, ఇలాంటి సేవా నిరతి కార్యక్రమాల్లో యువత భాగస్వాములు కావాల్సిందిగా అజయ్ పిలుపునిచ్చారు.

ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం

చొప్పదండి,ప్రభాతవార్త: ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం చొప్పదండి



మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మహేష్ను సంధ్య మల్లేశంకు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కౌన్సిలర్లు అవకాశం కల్పించడం అభినందనీయమని జాతీయ యువజన అవార్డు గ్రహీత అలువాల విష్ణు, జిల్లా పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు కొలిపాక కమలాకర్ లు పేర్కొన్నారు. ఈ మేరకు చొప్పదండి మున్సిపల్ కో ఆప్షన్స్ సభ్యులుగా ఎన్నికైన సందర్భంగా మంగళవారం మహేష్ ని సంధ్య మల్లేశం ను ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

మండల రిసోర్స్ సెంటర్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న సిబ్బందిని బదిలీ చేయండి

చొప్పదండి,ప్రభాతవార్త: చొప్పదండి మండల రిసోర్సెస్ సెంటర్లో ఏళ్ల తరబడి పని చేస్తున్న ఎం ఐ సి కోఆర్డినేటర్, కంప్యూటర్ ఔట్ సోర్సింగ్ ఆపరేటర్లను తక్షణమే బదిలీ చేయాలని జిల్లా విద్యాధికారిని భక్తు విజయకుమార్ కోరారు. గత అనేక సంవత్సరాలుగా చొప్పదండి రిసోర్స్ సెంటర్లో ఒకే ప్రదేశంలో విధులు నిర్వహిస్తున్న ఎం ఐ సి కోఆర్డినేటర్, కంప్యూటర్ ఆపరేటర్ లు ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులైనప్పటికీ నిబంధనలకు అనుగుణంగా వేరే ప్రదేశానికి బదిలీ చేయాలని మంగళవారం జిల్లా విద్యాధికారిని కోరారు. పారదర్శకమైన పరిపాలన కోసం అవసరమైన చర్యలు తీసుకొని ఒకే ప్రదేశంలో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని తక్షణమే బదిలీ చేసి పారదర్శకత పాటించాలని విజయ్ కుమార్ కోరారు.

దాడులను ఖండించండి.. అభివృద్ధిపై దృష్టి పెట్టండి

బాధితుడి పరామర్శను రాజకీయం చేయడం సరికాదు:
బీఆర్ఎస్ నేతలువట్టెంల అభివృద్ధిపై నిధుల వివరాలు వెల్లడించాలి:
యామ తిరుపతి

వేములవాడ రూరల్ ప్రభాత వార్త

వేములవాడ రూరల్ మండలం వట్టెంల గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు గుడి రత్నాకర్ రెడ్డిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మంద శ్రీనివాస్, యామ తిరుపతి, మంద వేణు పేర్కొన్నారు. దాడికి గురైన రత్నాకర్ రెడ్డిని పరామర్శించేందుకు వచ్చిన నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావుపై స్థానిక కాంగ్రెస్ నాయకులు చేస్తున్న విమర్శలను వారు తప్పుబట్టారు. బాధితుడిని పరామర్శించడాన్ని రాజకీయం చేయడం సరికాదని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా మంద శ్రీనివాస్ మాట్లాడుతూ.. బాధితుడిని పరామర్శించిన సమయంలో చల్మెడ లక్ష్మీ నరసింహారావు ఎక్కడా గుండాయిజాన్ని ప్రోత్సహించలేదని అన్నారు. గ్రామాభివృద్ధికి సంబంధించి సర్పంచ్‌కు సూచనలు చేయడంలో తప్పేముందని ప్రశ్నించారు. గ్రామంలో నిజమైన అభివృద్ధి పనులు చేపడితే బీఆర్ఎస్ పార్టీ మొదట స్వాగతిస్తుందని తెలిపారు. రాజకీయ విమర్శల కంటే గ్రామాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.యామ తిరుపతి మాట్లాడుతూ.. గతంలో తన తల్లి యామ సుమతి సర్పంచ్‌గా ఉన్న సమయంలో వార్డు సభ్యులు తీర్మానాలకు



సహకరించకుండా ఆటంకాలు సృష్టించారని పేర్కొన్నారు. గత పరిస్థితులను వక్రీకరించడం మానుకుని, ప్రస్తుత సర్పంచ్ గత మూడేళ్లలో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు, వాటికి కేటాయించిన నిధుల వివరాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. ఎవరెన్ని గొప్పలు చెప్పుకున్నా గతంలో జరిగిన పనులు, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధిని బేరీజు వేసి వట్టెంల ప్రజలే వాస్తవాలను నిర్ణయిస్తారని అన్నారు.మంద వేణు మాట్లాడుతూ.. ఇతరులను విమర్శించే కాంగ్రెస్ నాయకులు తమ గత చరిత్రను, తమపై వచ్చిన ఆరోపణలను కూడా ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. రాజకీయ విమర్శల కోసం మానవీయ కోణంలో జరిగిన పరామర్శను వివాదాస్పదం చేయడం మానుకోవాలని సూచించారు.బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు తమ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వారు స్పష్టం చేశారు. గ్రామంలో రాజకీయ విభేదాలకు తావివ్వకుండా అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని ఈ సందర్భంగా వారు కోరారు.

వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు చేయాలి

ఎఫ్ పీఓ, సీహెచ్ సీలు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి
వరి సాగు వద్దు.. ప్రత్యామ్నాయ పంటలు వేయాలి
జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
బోయినపల్లి మండలం విలాసాగర్ లో కేత్ బచావో అభియాన్, రైతు నేస్తం కార్యక్రమానికి హాజరు

బోయిన్ పల్లి ప్రభాత వార్త

వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. బోయినపల్లి మండలం విలాసాగర్ గ్రామంలో కేతు బచావో అభియాన్, రైతు నేస్తం కార్యక్రమాలు సీ హెచ్ సీ, ఎఫ్ పీఓ, ఎస్ హెచ్ జీ మహిళలు, రైతులకు మంగళవారం నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా సీ హెచ్ సీ (కస్టమ్ హైరింగ్ సెంటర్స్), ఎఫ్ పీ ఓ (ఫార్మర్స్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్) వ్యవసాయ యాంత్రీకరణ, దరఖాస్తు, వినియోగం, సూపర్ ఎల్ నినో ప్రభావం, ప్రత్యామ్నాయ పంటల సాగు తదితర అంశాలపై హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్, డైరెక్టర్ గోపి వివరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 99 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రత్యామ్నాయ పంటల సాగు పై అవగాహన కల్పించామని, దీంతో రాష్ట్రంలో 35 శాతం పప్పు ధాన్యాలు, 20 శాతం నూనె గింజల సాగు, భారీగా కూరగాయల సాగు పెరిగిందని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సూపర్ ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు రైతులు వరి సాగు చేయవద్దని సూచించారు. రిజర్వాయర్లలోని నీటిని తాగు నీటికి, జీవాల కోసం వినియోగించాలని తెలిపారు. భూగర్భ జలాలు గత ఏడాది తో పోలిస్తే 2.27 మీటర్ల లోతులోకి పడిపోయాయని తెలిపారు. ఒక ఎకరంలో వరి సాగు చేస్తే దాదాపు 35 నుంచి 40 లక్షల లీటర్ల నీరు అవసరమని వెల్లడించారు. విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. పొడి, ఎండ వాతావరణంతో రాను రాను రాను భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయని వివరించారు. బోయినపల్లి మండల రైతులు సాగులో



ఆదర్శంగా నిలుస్తున్నారని, గత సీజన్లో ప్రత్యామ్నాయ పంటల సాగులో ముందున్నారని అభినందించారు. ఆయిల్ ఫామ్ సాగుపై మండలంలో సమావేశం నిర్వహించగా చాలామంది ముందుకు వచ్చారని ఖమ్మం జిల్లాలో ఆయిల్ పామ్ సాగు, అలాగే ఫ్యాక్టరీ సందర్శనకు వెళ్లి వచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుత సూపర్ ఎల్ నినో ప్రభావంతో ఈ యాసంగి సీజన్లో రైతులు నువ్వులు, పొద్దు తిరుగుడు, వేరుశనగ, కూరగాయలు, ఆకుకూరలు, పప్పు ధాన్యాలు ఆయిల్ ఫామ్ చేయాలని పిలుపునిచ్చారు.డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్లు వాడి నీటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆయిల్ ఫామ్ కు టన్ను ధర ప్రస్తుతం 23 వేల 641 ఉందని వెల్లడించారు. అలాగే జిల్లాకు దగ్గర్లోనే సిద్దిపేట జిల్లాలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఉందని వివరించారు. ఆయిల్ ఫామ్ ఉత్పత్తులు సేకరించే కేంద్రం మండలంలోనే ఉందని గుర్తు చేశారు. రైతులు, ప్రజలు నీటిని పొదుపుగా వాడాలని, వీబీ జీ రామ్ జీ కింద జల సంరక్షణ పనులు ముమ్మరంగా చేపట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణ జలసిరిలో భాగంగా ఇంకుడు గుంతలు, బోర్వెల్ రీఛార్జ్ గుంతలు, మ్యాజిక్ సోక్ పిట్ పనులు చేయించాలని సూచించారు. దీంతో రానున్న కాలంలో వర్షం నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాలు వృద్ధి చెందేందుకు ఉపయోగపడతాయని తెలిపారు.కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అష్టల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, తహసీల్దార్ షరీఫోద్దీన్, ఇంచార్జి ఎంపీడీఓ శ్రీధర్, సర్పంచ్ కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

అదనపు కలెక్టర్ గడ్డం నగేష్
.రుద్రంగి ప్రభాత వార్త :

భూముల రీ సర్వే ప్రక్రియ ఇలాంటి పొరపాట్లు లేకుండా, పారదర్శకంగా చేపట్టాలని, రైతులు భూముల రీ సర్వే ప్రక్రియకు సహకరించాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అన్నారు. మంగళవారం రుద్రంగి మండల కేంద్రంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూముల రీ సర్వే ప్రక్రియలో ప్రతి సర్వే నంబర్ కు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాలు పక్కాగా ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. సర్వే చేయబోయే భూములకు సంబంధించిన రైతులకు ముందుగానే సమాచారం



అందించాలని, వారి సమక్షంలో రీ సర్వే ప్రక్రియ చేపట్టాలని సూచించారు. సర్వే పై ఎలాంటి అపోహలు వద్దని, సర్వేకు రైతులు పూర్తిస్థాయిలో సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, తహసీల్దార్ పుష్పలత, రైతులు, తదితరులు ఉన్నారు.

వేములవాడ వార్త

ప్రజల అవసరమే ప్రాధాన్యం

ప్రజల అవసరాల కోసం నిరంతరం ప్రజాక్షేత్రంలో ఎమ్మెల్యే సత్యం

బోయిన్ పల్లి ప్రభాత వార్త



సమయం రాత్రి 10:30 గంటలు అయిన ప్రజల అవసరమే తన బాధ్యతగా భావిస్తూ, సమయంతో సంబంధం లేకుండా నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తు ఎల్ నీనో కరువు దృష్ట్యా తాగునిటితో ప్రజలు ఇబ్బంది పడకూడదు అని బోయినిపల్లి మండలం గుడన్నపల్లి గ్రామంలో నూతన బోర్‌వెల్ పనులకు కొబ్బరికాయ కొట్టి చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సువీన్ యాదవ్,మాజీ అధ్యక్షుడు వన్నెల రమణా రెడ్డి,కాంగ్రెస్ నేతలు నాగుల వంశీ గౌడ్,నిమ్మ వినోద్ రెడ్డి,ఉపేందర్, సర్పంచ్ లావణ్య నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను బోయిన్ పల్లి కి మార్చాలి

గుడి రవీందర్ రెడ్డి బిజెపి జిల్లా నాయకులు

బోయిన్ పల్లి ప్రభాత వార్త



బోయిన్ పల్లి మండలంలో గతంలో ఉన్న గురుకుల పాఠశాలను బి.ఆర్.ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు విలాసాగర్ నుండి వేములవాడకు తరలించారు .అని తదనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మళ్లీ అదే పద్ధతిలో వేములవాడ నుండి గంగాధరకు తరలించారని దీనిని మరలా బోయిన్ పల్లి స్థలానికి తీసుకువచ్చి ఇక్కడి విద్యార్థులకు న్యాయం చేసే విధంగా ప్రభుత్వం ప్రయత్నం చేయాలని బిజెపి జిల్లా నాయకులు గుడి రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని విద్యార్థులు గురుకుల పాఠశాల లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గతంలో ఎన్నో ఉద్యమాలు చేసిన ఫలితంగా బోయిన్ పల్లికి గురుకుల పాఠశాల వచ్చిందని కానీ ఇక్కడ గురుకుల పాఠశాలను ఎక్కడికి పడితే అక్కడికి మార్చి మండల విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రుల జీవితాలతో చల గాటం మాడుతున్నారని దుయ్య బట్టారు. తక్షణమే చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దీనిపై దృష్టి సారించి ఇక్కడికి బోయిన్ పల్లి కి మార్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు

అంగన్వాడీ కేంద్రంలో ప్రత్యేక సభ

రుద్రంగి ప్రభాత వార్త :



రుద్రంగి మండల కేంద్రంలోని 6వ అంగన్వాడి కేంద్రంలో మంగళవారం ప్రత్యేక సభను అత్యంత వైభవంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి నటరాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నటరాజ్ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు మరియు చిన్న పిల్లల ఆరోగ్య సంరక్షణలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కొనియాడారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ముఖ్యంగా చిన్న పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు అంగన్వాడీ కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని, కేంద్రాల నిర్వహణ పారదర్శకంగా ఉండాలని సూచించారు. అనంతరం గ్రామానికి చెందిన బాసని వరలక్ష్మీ & గంగాధర్ తమ కూతురు పుట్టినరోజు సందర్భంగా అంగన్వాడీ కేంద్రానికి ఆరు కుర్చీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్, కార్యకర్తలు, మండల పరిషత్ సూపరింటెండెంట్, స్థానిక గర్భిణి స్త్రీలు, బాలింతలు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధి వైపు మొగ్గు చూపాలి

మిరపలో విలువ జోడింపుపై శిక్షణ
సర్పంచ్ ప్రతిమ, కేవీకే హెడ్ వెంకట రమేష్,

రామగిరి ప్రభాతవార్త



మహిళలు స్వయం ఉపాధి వైపు మొగ్గు చూపాలని రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు, రామగిరి జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ కోట వెంకట రమేష్, ఐకెపి డీపీఎం కానిగంటి. రవికుమార్ అన్నారు. రామగిరి మండలం రత్నాపూర్ పరిధిలోని రామగిరి ఖిల్లాశ్రీ కొండా లక్ష్మ ణ్ తెలంగాణ ఉద్యాన విశ్వ విద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం, నిప్టం, (వి। నీగినిలీ) తమిళనాడు వారి సంయుక్తంగా మహిళల స్వయం ఉపాధి సంఘాలకు మిరపలో విలువ జోడింపు అనే అంశం మీద వృత్తి పరమైన శిక్షణ కార్యక్రమం మంగళవారం రామగిరి ఖిల్లా కృషి విజ్ఞాన కేంద్రం లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రత్నాపూర్ గ్రామ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు విచ్చేసి మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు, గవర్నమెంట్ మహిళల అభివృద్ధికి అందిస్తున్న వివిధ స్కీమ్స్ గురించి తెలుపుతూ మహిళలు అభివృద్ధి చెందాలంటే స్వయం ఉపాధి వైపు మొగ్గు చూపాలని, వ్యవసాయ మరియు ఉద్యాన రంగాలలో మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు చాలా మెండు గా ఉన్నాయని కావున మహిళ రైతులు ఈ అవకాశం ను వినియోగించుకోవాలని తెలిపారు. డిపిఎం రవికుమార్ విలువ జోడింపు శిక్షణ కార్యక్రమాలు మహిళలకు చాలా రకాలుగా ఉపయోగపడతాయని ప్రస్తుతం నిర్వహిస్తున్న మిరపలో విలువ జోడింపు శిక్షణ కార్యక్రమం మహిళలకు స్వయం ఉపాధి కల్పించే ఉపాధిగా మహిళలకు తోడ్పడుతుందని కావున మహిళలు ఈ శిక్షణా కార్యక్రమం పూర్తిగా వినియోగించుకోవాలని ఇందులో నేర్చుకున్న అంశాలను ఉపాధి మార్గంగా అలవర్చుకోవాలని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం, సీనియర్ శాస్త్రవేత్త డా. వెంకట రమేష్ మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం మహిళల అభివృద్ధి కోసం వివిధ కార్యక్రమాలను గ్రామాలలోని మహిళలకు నిర్వహిస్తున్నామని అదేవిధంగా వారి ఆసక్తికి అనుగుణంగా వివిధ వృత్తిపరమైన శిక్షణ కార్యక్రమాలను చేపడుతూ వారికి స్వయం ఉపాధి కల్పించే విధంగా ఇతర సంస్థలతో అనుసంధానం చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం మిరపలో విలువ జోడింపు అనే శిక్షణ కార్యక్రమంను మహిళా రైతులు ఉపయోగించుకొని ఉపాధి మార్గంగా ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మిరపలో విలువ జోడింపుకి కావలసిన యంత్రాలు వాటి పనితీరు అవి ఏ విధంగా పనిచేస్తాయో తెలుపుతూ వాటిని ఉపయోగించి మిరపలో వివిధ పదార్థాలు అనగా చిల్లి పౌడర్ చిల్లి ఫ్లెక్స్ తయారీ విధానం గురించి, మరియు బంతిపూల నుండి కలర్ ఎక్స్ట్రాక్షన్ గురించి దానివల్ల కలిగే లాభాల గురించి మహిళా రైతులకి శాస్త్రవేత్తలు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమం తదానంతరం కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటుచేసిన మిరప ప్రాసెసింగ్ సెంటర్ ని మహిళా రైతులు సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి నవ్య, డాక్టర్ భీమిశెట్టి భాస్కర్ రావు, ఏపిఎం పద్మ మరియు మహిళల రైతులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ ను పరామర్శించిన మంత్రి

రామగిరి ప్రభాతవార్త



కమాన్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు తండ్రి సాంబయ్య ఇటీవల మృతి చెందగా మంగళవారం రాష్ట్ర ఐటీ, పరుశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా మృతుడు సాంబయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సాంబయ్య నేత్రాలు దానం చేసినందుకు సదాశయ పౌండేషన్ ఆధ్వర్యంలో సదరు నేత్ర దాత కుటుంబ సభ్యులను గౌరవ ప్రదంగా శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి యాదవ్, సింగిల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కరరావు, మాజీ ఎంపీపీ కోలేటి మారుతి, రామగిరి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తులసి రామ్ గౌడ్, సుర సమ్మయ్య,కమాన్పూర్ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, ఐ ఎన్టియుసి ఆర్ జి త్రి ఉపాధ్యక్షుడు కోట రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఇనుగంటి రామారావు, గాండ్ల మోహన్, పిల్లి శేఖర్ ,బాద్రపు శంకర్, తదితరులు ఉన్నారు.

స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు

కల్పించేందుకే మంథనిలో వస్త్ర పరిశ్రమ, ఫార్మసీ కళాశాల ఏర్పాటు
లద్నాపూర్ వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

రామగిరి ప్రభాతవార్త



గ్రామీణులకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్ యంగా బాలవికాస సంస్థ సహకారంతో పలు గ్రామాల్లో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. మంగళవారం రామగిరి మండలం లోని లద్నాపూర్‌లో బాలవికాస సంస్థ (రోంకలి ఇంటర్నేషనల్ ఫౌండేషన్ కెనడా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్‌తో కలిసి ప్రారంభించారు. గ్రామస్తులు 20 శాతం నిధులు సమకూర్చుకుని ముందుకు రావడం అభినందనీమన్నారు. త్వరలో మంథనిలో వస్త్ర పరిశ్రమను ప్రారంభిస్తామని, ఫార్మసీ కళాశాలను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని, బొగ్గు ఉత్పత్తి కోసం భూములు కోల్పోయిన ప్రాంత ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్ మాట్లాడుతూ ముమ్యంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థంగా అమలు చేస్తోందన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో రామగుండం, పెద్దపల్లి జిల్లాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు తొగరి చంద్రయ్య, అడ్లూరి ప్రవీణ్, తోపాటు బాలవికాస సంస్థ ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ నిధులు వెంటనే విడుదల చేయాలి

సిఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పోలవేణి నరేష్ యాదవ్

మానకొండూర్, ప్రభాతవార్త,:



కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా బిఏ, ఎల్ ఎల్ బి, డిగ్రీ కళాశాల, పాఠశాలలో చదువుతున్న పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు, స్కాలర్షిప్ నిధులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని భారత కేంద్ర విద్యార్థి సమాఖ్య (సి ఎస్ ఎఫ్ ఐ) జిల్లా కార్యదర్శి పోలవేణి నరేష్ యాదవ్ ఒక ప్రకటన ద్వారా మంగళవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సి ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి పోలవేణి నరేష్ యాదవ్ మాట్లాడుతూరాష్ట్రంలో వేలాది మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈ బీసీ, మైనార్టీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు, పరీక్షలకు అనుమతించక తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని, దీంతో విద్యార్థులు మనోవేదనకు గురవుతున్నారని ఆరోపించారు.బిఏ,ఎల్ ఎల్ బి వంటి ప్రొఫెషనల్ కోర్సులు చదువుతున్న పేద విద్యార్థులు లక్షల రూపాయల ఫీజులు కట్టలేక మధ్యలోనే చదువు మానేసే పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ లో ఉన్న రూ. వేల కోట్ల ఫీజు బకాయిలను కాలేజీలకు విడుదల చేసి, విద్యార్థుల ఖాతాల్లో స్కాలర్షిప్ నిధులు జమ చెయ్యాలని డిమాండ్ చేశారు. ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ఫీజు రీయింబర్స్మెంట్ విధానాన్ని పారదర్శకంగా అమలు చేయాలన్నారు. విద్యార్థుల సమస్యల పట్ల ప్రభుత్వం స్పందించకపోతే, జిల్లాలోని అన్ని కాలేజీల విద్యార్థులను కలుపుకొని పెద్ద ఎత్తున కలెక్టరేట్ ముట్టడి, రాస్తారోకో నిరసన కార్యక్రమాలు చేపడతామని నరేష్ యాదవ్ హెచ్చరించారు.

మంథని వార్త



ఎఎల్పి గనిని సందర్శించిన సీఎంపీడీఐ బృందం



రామగిరి ప్రభాతవార్త

సింగరేణి అడ్రియాల లాంగ్ వాల్ గనిని మంగళవారం సెంట్రల్ మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇన్స్టిట్యూట్ (సీఎంపీడీఐ) జనరల్ మేనేజర్ శంభుశరణ్ నేతృత్వంలో పమేంద్ర కుమార్ సింగ్, పవన్ కుమార్, రాఘవేంద్ర ప్రతాప్ సింగ్, బృందం సందర్శించింది.ఈ సందర్భంగా అడ్రియాల లాంగ్ వాల్ గని లోని నాలుగో ప్యానెల్ లో ఏర్పాటు చేసిన, ఏర్పాటు చేస్తున్న సపోర్టింగ్ చాక్ లను బృందం క్షుణ్ణంగా పరిశీలించింది .నాలుగో ప్యానెల్‌కు అనుమతుల మంజూరు ప్రక్రియలో భాగంగా ఈ తనిఖీ బృందం గనిని సందర్శించి, అక్కడి ఏర్పాట్లను పరిశీలించింది.గనిలో భద్రతా ప్రమాణాలు, సాంకేతిక ఏర్పాట్లు, సపోర్టింగ్ వ్యవస్థలను పరిశీలించడం ఈ తనిఖీలో భాగంగా నిర్వహించారు.వారితోపాటు అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, భూగర్భ గనుల విభాగం జనరల్ మేనేజర్ కె.యాదయ్య, ఎస్ఓటుజిఎం బండి సత్యనారాయణ, ఏరియా ఇంజనీర్ దూప్ సింగ్, ప్రాజెక్టు ఆఫీసర్ కె.జనార్దన్, ప్రాజెక్టు ఇంజనీర్ బాలరాజు, మేనేజర్ పెంచలయ్య, వి.వో సమద్, జెంకో అధికారులు నరసింహం, బల్ల శ్రీధర్, రంజిత్, ఇతర అధికారులు ఉన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన మంత్రి



రామగిరి ప్రభాతవార్త

రామగిరి మండలం నాగ పెల్లి ,బేగంపేట గ్రామాలలో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన బాధిత కుటుంబాలను రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు మంగళవారం పరామర్శించారు. నాగ పెల్లి గ్రామానికి చెందిన మంథని మండలం సూరయ్య పల్లె పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న శనిగారపు జైపాల్ , తాటి శ్రీనివాస్ గౌడ్, దూడం వెంకటస్వామి, మాజీ సర్పంచ్ పొన్నం మధు గౌడ్ లు మృతిచెందగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి మృతి పట్ల ఆ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే బేగంపేట గ్రామానికి చెందిన ముత్తే అరవింద్ కళ్యాణ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు మనోధైర్యం కల్పించారు. మంత్రి వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, మండలకాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తులసిరామ్ గౌడ్, మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమరయ్య గౌడ్, గ్రామ సర్పంచ్ కొండవేన దివ్యా సుధాకర్, ఎల్లే రామ్మూర్తి, కండె పోశం, కొండవేనా ప్రభాకర్ ,బంకు మల్లేష్ తో తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్,గంజాయి కోసం డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు

వీణవంక, ప్రభాత వార్త:



వీణవంక మండల కేంద్రం తో పాటు ఘనముక్కుల గ్రామములో డ్రగ్స్ ,గంజాయి దొరుకుతుందనే సమాచారం మేరకు దుకాణాలలో, అనుమానస్పద ప్రాంతాలలో మంగళవారం డాగ్ స్క్వాడ్ తో పోలీసులు తనిఖీలు చేశారు. కాగా తనిఖీలలో లభ్యం కాలేదు.తనిఖీలు గంజాయి,మత్తు పదార్థాల నివారణకు ఎంతో దోహదపడతాయని ఎస్సై.ఆవుల తిరుపతి తెలిపారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన భోజేందర్ రెడ్డి

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం, నిత్యావసర సరుకుల పంపిణీ

గొల్లపల్లి, ప్రభాతవార్త:

ఇటీవల అనారోగ్యం, ఇతర కారణాలతో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను సామాజిక సేవకుడు ఎడమల భోజేందర్ రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మండలంలోని గుంజపడుగు గ్రామానికి చెందిన మారం పద్మ, శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన పొన్నం సత్తయ్య, అబ్బాపూర్ గ్రామానికి చెందిన చిలకమారి శ్రీహరి మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా పొన్నం సత్తయ్య కుటుంబ సభ్యులకు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేయగా, చిలకమారి శ్రీహరి కుటుంబ సభ్యులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బాధిత



కుటుంబాలకు అండగా నిలిచారుఈ కార్యక్రమంలో గుంజపడుగు సర్పంచ్ నవ్వ అంజన్న, శంకర్రావుపేట ఉపసర్పంచ్ గుర్రం రంజిత్ రెడ్డి, యూత్ నాయకుడు ఆవారి చందు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుతో అధిక లాభాలు పొందాలి

ధర్మపురి, ప్రభాతవార్త:

ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత తగ్గే అవకాశాల నేపథ్యంలో రాబోయే యాసంగిలో వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి ఎం. రాజకుమార్ సూచించారు. గురువారం జైన రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఖేత్ బచావో అభియాన్‌లో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెసర, మినుము, జొన్న, సజ్జ, వేరుశనగ, నువ్వులు, కుసుమ, చిరుధాన్యాలు, కూరగాయలు, పొద్దుతిరుగుడు వంటి పంటలు సాగు చేయాలని, ఆయిల్‌పామ్ సాగుతోనూ ఆదాయం పొందవచ్చని తెలిపారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడుతూ, సేంద్రియ, జీవ ఎరువులకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. పంట మార్పిడి, అంతర



పంటల సాగు చేపట్టాలని, వరి కొయ్యలను కాల్చకుండా నేలలో కుళ్లిపోయేలా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ లు మంజుల, సమత, అజయ్, నవ్య, పీఏసీఎస్ సీఈఓ సాగర్‌రావు, రైతులు పాల్గొన్నారు.

బాలల భద్రతపై అవగాహన అవసరం

ధర్మపురి, ప్రభాతవార్త:

బాలలపై లైంగిక నేరాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జూనియర్ సివిల్ జడ్జి వై. జానకి సూచించారు.మంగళవారం ధర్మపురి బాలబాలికల ఉన్నత పాఠశాలలో పోక్సో చట్టం-2012పై నిర్వహించిన న్యాయ అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలల హక్కులు, రక్షణకు చట్టం కల్పిస్తున్న అవకాశాలు, వ్యక్తిగత భద్రత గురించి విద్యార్థులకు వివరించారు. మంచి స్పర్శ, చెడు స్పర్శపై అవగాహన కలిగి ఉండాలని, ఎవరైనా అసభ్యంగా లేదా అనుచితంగా ప్రవర్తిస్తే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. బాలలపై జరిగే నేరాలను గుర్తించి,



నివారించడంలో విద్యాసంస్థలు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ శాఖ రక్త దాన శిబిరానికి అనూహ్య స్పందన

ఎస్సై బి జగదీశ్వర్

చిగురుమామిడి, ప్రభాత వార్త

:పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరంనకు అనూహ్య స్పందన లభించింది.ఈ శిబిరానికి చిగురుమామిడి మండలం లోని వివిధ గ్రామాల ప్రజలు పాల్గొని రక్తదానం చేశారు. మనము చేసే రక్తదానం ఆపదలో ఉన్న ఒకరి ప్రాణాన్ని కాపాడగలదనే ఉద్దేశ్యం తో రక్తదానం చేయడం ద్వారా మానవతా విలువలను చాటుతూ, సమాజ సేవలో భాగస్వాములు కావడం అదృష్టంగా భావిస్తున్నట్లు దాతలు తెలిపారు. చిగురుమామిడి మండలం వార్త వాట్సాప్



గ్రూప్ సభ్యులు గునుకుల మహిపాల్ రెడ్డి, రిటైర్డ్ మండల పరిషత్ సూపరిండెంట్ ఎండీ ఖాజా మొయినొద్దీన్, పంచాయతీ కార్యదర్శులు గోదారి అజయ్ కుమార్, వేముల నాగరాజు, రేకొండ గ్రామ సర్పంచ్ అల్లెపు సంపత్, గోగూరి రాజిరెడ్డి లు పాల్గొని రక్త దానం చేశారు. అనంతరం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో దాతలకు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. రక్త దాన శిబిరం లో పాల్గొని రక్త దానం చేసిన దాతలకు చిగురుమామిడి ఎస్సై బి జగదీశ్వర్, పోలీస్ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

తృటిలో తప్పిన పెను ప్రమాదం.

..ఊపిరి పీల్చుకున్న ప్రయాణికులు

..జాతీయ ప్రధాన రహదారిపై ట్రాఫిక్ జామ్

మానకొండూర్, ప్రభాతవార్త:

మానకొండూర్ మండల కేంద్రంలోని కరీంనగర్ వరంగల్ ప్రధాన రహదారి అయిన చెరువు కట్ట సమీపంలో మంగళవారం గ్రానైట్ బండ లారీలో నుండి అదుపుతప్పి రోడ్డుపై పడటంతో తృటిలో పెను ప్రమాదం తప్పిందని, వాహనదారులు ఒక్కసారి ఊపిరి పీల్చుకున్నారు. ప్రధాన రహదారి పై గ్రానైట్ బండ రోడ్డు పై పడడంతో ఇరువైపులా భారీగా వాహనాలు సుమారుగా రెండు గంటలు నిలిచిపోయాయి. తిమ్మాపూర్ మండలం పోలంపల్లి నుండి గ్రానైట్ బండతో కరీంనగర్ వైపుగా వెళ్తున్న లారీ మానకొండూరు మండల కేంద్రంలోని చెరువు కట్ట వద్ద మూలమలుపు వద్ద ప్రమాదవశాత్తు అదుపుతప్పి, గ్రానైట్ బండ నడి రోడ్డు పై పడిపోయింది. ఆ సమయంలో లారీ వెనుక ముందు, రోడ్డుపై వాహనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు అంటున్నారు. ఎలాంటి ముందస్తు రక్షణ చర్యలు లేకుండా గ్రానైట్ బండలను ఓవర్ లోడ్ లారీలతో



తరలించడం, మితిమీరిన వేగంతో గ్రానైట్ లారీలు ప్రధాన రహదారిపై వెళ్తున్నా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారిపై నిత్యం గ్రానైట్ లారీలు రాకపోకలతో ఎప్పుడు ఏమి జరుగుతుందేమోనని వాహనాదారులు భయాందోళన కు గురవుతున్నారు. మానకొండూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రోడ్డుపై నిలిచిపోయిన ట్రాఫిక్ ను పోలీసులు శ్రమించి పునరుద్ధరించారు.

ధర్మపురి వార్త

పీఎం జేజేబీవై బీమా చెక్కు అందజేత

గొల్లపల్లి, ప్రభాతవార్త:



యూనియన్ బ్యాంక్‌లో ఖాతా కలిగి ఉండి, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన సదుపాయం పొందిన రాఘవపట్నం గ్రామానికి చెందిన ఉత్తం మమత అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆమెకు మంజూరైన సాధారణ మరణ బీమా పరిహారం రూ.2 లక్షల చెక్కును మంగళవారం జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ కుమార్ మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు.జనసురక్ష కార్యక్రమంలో భాగంగా రాఘవపట్నం గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బ్యాంకు ఖాతా కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ బీమా సదుపాయాన్ని పొందాలని సూచించారు. అనుకోని పరిస్థితుల్లో కుటుంబ సభ్యులను కోల్పోయినప్పుడు బీమా ఆర్థిక భరోసా కల్పిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ అవినాష్, ఎఫ్ఎల్సీ మధుసూదన్, గ్రామ సర్పంచ్ కాసారపు భవాని, ఉపసర్పంచ్ శిరవేణి రవి,వార్డు సభ్యులు బుర్ర తిరుపతి,ఇన్‌చార్జి ఏపీఎం శ్రీనివాస్, సిఎఫ్ఎల్ కౌన్సిలర్లు రమేష్, వెంకటేష్, విజయ్, వీవోలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో ధర్మపురి గురుకుల విద్యార్థినికి బంగారు పతకం

ధర్మపురి, ప్రభాతవార్త:



జగిత్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 25న నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ధర్మపురి మైనారిటీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని ఎన్. లస్మిత బంగారు పతకం సాధించింది. అండర్14 బాలికల విభాగంలో 200 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది .ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సి.హెచ్. సాహిత్య, వ్యాయామ ఉపాధ్యాయురాలు జి. భారతి, ఇతర ఉపాధ్యాయులు లస్మితను అభినందించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని, నిరంతర సాధనతో మరిన్ని విజయాలు సాధించాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షి ంచారు.

యమధర్మరాజు ఆలయంలో ప్రత్యేక అభిషేకం

ధర్మపురి, ప్రభాతవార్త:



భరణి నక్షత్రాన్ని పురస్కరించుకుని అనుబంధ దేవాలయమైన శ్రీ యమధర్మరాజు వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం వేళలో అర్చకులు ,వేద పండితులు స్వామి వారికి పురుషసూక్తం లక్ష్మీసూక్తం, మన్యుసూక్తంతో అభిషేకం, ఆయుష్య హోమం నిర్వహించి, హారతి, మంత్రపుష్పం సమర్పించారు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ యమధర్మరాజు ఆలయంతో పాటు శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్య నిర్వహణాధికారి శ్రీనివాస్ ,అధికారులు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు

క్వింటాలుకు రూ.2,962 వరకు ధర.. సన్న వడ్లకు బోనస్... పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు.. పెద్దకల్వల, తుర్కలమద్దికుంట గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల ప్రారంభం



పెద్దపల్లి, ప్రభాతవార్త: పంటను విక్రయించే విషయంలో రైతులు తమకు లాభదాయకమైన మార్గాన్ని ఎంచుకోవచ్చని, కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సహించేది లేదని పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు స్పష్టం చేశారు. పెద్దపల్లి మండలంలోని పెద్దకల్వల, తుర్కలమద్దికుంట గ్రామాల్లో మంగళవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దళారులు ముందుగా ధాన్యం కొనుగోలు చేసి, ఆపై ధర తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ పరిస్థితిని నివారించేందుకే నియోజక వర్గవ్యాప్తంగా కేంద్రాలను వేగంగా అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు. రైతులు ఐకేపీ, సింగిల్ విండో కేంద్రాల్లో ధాన్యం విక్రయించవచ్చని, బయట ఎక్కువ ధర వస్తే అక్కడ అమ్ముకోవడం కూడా వారి నిర్ణయమేనన్నారు. కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలుకు రూ.2,462 మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు రూ.500 బోనస్ కలిపి రూ.2,962 అందుతుందని తెలిపారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతుందని పేర్కొన్నారు. తూకంలో రైతులను ఇబ్బంది పెట్టే కేంద్రాల ఇన్‌చార్జులను తొలగిస్తామని హెచ్చరించారు. తుఫాను కారణంగా పంట తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, సూపర్ ఎల్ నినో ప్రభావం దృష్ట్యా ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. బావుల్లోని నీటిని సమర్థంగా వినియోగించి వరికి అవసర మయ్యే నీటితో ఎక్కువ విస్తీర్ణంలో ఆరుతడి పంటలు సాగు చేయవచ్చని వివరించారు. రైతుల పంటలు ఎండిపోకుండా ప్రభుత్వ పెద్దల సహకారంతో సాగునీరు అందించామని చెప్పారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ ముత్యాల నరేష్, సందనవేనా రాజేందర్ యాదవ్, డీసీఓ, సింగిల్ విండో సీఈఓలు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితులకు తక్షణ వైద్యం!

ప్రాణాలు కాపాడితే రూ.25 వేల ప్రోత్సాహకం

పీఎం రాహత్, రాహ్‌వీర్ పథకాలపై సీపీ సమీక్ష

ఈసాక్ష్యం, ఈసమన్ల అమలులో నిర్లక్ష్యం వద్దు..

గడువులోగా ఛార్జ్‌షీట్లు దాఖలు చేయాలి



కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త: రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి సకాలంలో వైద్యం అందించి ప్రాణాలు కాపాడాలని, బాధితులను ఆసుపత్రులకు తరలించే వారికి ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందేలా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశించారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులతో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పీఎం రాహత్, రాహ్‌వీర్ పథకాలతో పాటు నూతన క్రిమినల్ చట్టాల అమలుపై సమీక్షించారు.గోల్డెన్ అవర్‌లో వైద్యంరోడ్డు ప్రమాద బాధితులకు ప్రమాదం జరిగిన వెంటనే అత్యవసర వైద్యం అందించడం పీఎం రాహత్ పథకం ముఖ్య ఉద్దేశమని సీపీ తెలిపారు. అర్హులైన బాధితులకు ఏడు రోజుల వరకు లేదా గరిష్ఠంగా రూ.1.50 లక్షల వరకు నగదు రహిత చికిత్స అందించే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆసుపత్రుల యాజమాన్యాలకు కూడా పథకం వివరాలను తెలియజేయాలన్నారు.ప్రాణదాతలకు ప్రోత్సాహకంప్రమాద బాధితులను సకాలంలో ఆసుపత్రులకు తరలించి ప్రాణాలు కాపాడే వారికి రాహ్‌వీర్ పథకం కింద రూ.25 వేల నగదు బహుమతి అందుతుందని సీపీ వివరించారు. అర్హులైన వ్యక్తులు ఏడాదిలో గరిష్ఠంగా ఐదుసార్లు ఈ ప్రోత్సాహకాన్ని పొందవచ్చన్నారు. క్షతగాత్రులకు సాయం చేసేందుకు ప్రజలు ముందుకు వచ్చేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.దర్యాప్తులో సాంకేతికతకు ప్రాధాన్యంనూతన క్రిమినల్ చట్టాల ప్రకారం కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు పారదర్శకత పాటించాలని సీపీ స్పష్టం చేశారు. నేర ప్రదేశాల్లో సాక్ష్యాధారాల సేకరణకు ఈసాక్ష్యా విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. న్యాయస్థానాల సమన్ల జారీకి ఈసమన్ల విధానాన్ని సమర్థంగా వినియోగించాలని సూచించారు.కేసు స్వభావాన్ని బట్టి చట్టంలో నిర్దేశించిన 60 లేదా 90 రోజుల గడువులోగా ఛార్జ్‌షీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నిందితులకు శిక్ష పడేలా పటిష్ఠ ఆధారాలు సేకరించాలని పోలీసు అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో ఏసీపీలు శ్రీనివాస్, శ్రీనివాస్ జి., వెంకటస్వామి, విజయకుమార్, స్వామితో పాటు సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కరీంనగర్‌ను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతా

కేంద్రం నుండి మరిన్ని నిధులు తీసుకొస్తా

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిలో కలిసి రండి

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి.సంజయ్ కుమార్



కరీంనగర్, ప్రభాతవార్త : అభివృద్ధిలో, క్లీన్ అండ్ గ్రీన్ లో కరీంనగర్ కార్పొరేషన్ ను తెలంగాణలోనే ఆదర్శంగా నగరంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతోనే చిత్తశుద్ధితో కృషి చేస్తున్నానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు..అందులో భాగంగా కేంద్ర, రాష్ట్రాల సహకారంతో పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తున్నామని పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ కరీంనగర్ కలిసి రావాలని, అభివృధి లో భాగస్వాములు కావాలని కోరారు. కరీంనగర్ పర్యటనలో భాగంగా కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 4వ డివిజన్ దుర్శేడ్ గోపాల్ పూర్ లో రూ.78 లక్షల యూఐడీఎఫ్ నిధులతో డ్రెయిన్, సీసీ రోడ్డు పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్, స్థానిక కార్పొరేటర్ భూపతి రవీందర్ లతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు.ఇప్పటికే యూఐడీఎఫ్ కింద 50 కోట్ల రూపాయలు వచ్చినయ్. ఆ నిధులతో సీసీ రోడ్లు, డ్రెయిన్ పనులను స్టార్ట్ చేసినం. ఈ స్కీం కింద మరో 30 కోట్ల రూపాయలు కూడా రాబోతున్నయ్. నగరంలో గల్లీగల్లీలో సీసీ రోడ్లను, డ్రెయిన్లను నిర్మిస్తాం. అట్లాగే స్మార్ట్ సిటీ కింద 900 కోట్ల రూపాయల నిధులను తీసుకొచ్చి కరీంనగర్ ను స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దినం. ఇవిగాకుండా అమ్రుత్ 1, 2 కింద 279 కోట్ల రూపాయలు ఖర్చు చేసినం. అట్లాగే అర్బన్ డెవలెప్ మెంట్ ఫండ్ కింద రూ.50 కోట్లు వచ్చినయ్. వాటితో గల్లీల్లో రోడ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినం. తీగలగుట్టపల్లి ఆర్వోబీ నిర్మాణం కోసం కేంద్రమే పూర్తిగా 156 కోట్లను మంజూరు చేసింది. శరవేగంగా పనులు జరుగుతున్నాయి. 840 కోట్ల యూసీఎఫ్ నిధులతో కరీంనగర్ కార్పొరేషన్ రూపురేఖలే మారబోతున్నాయి. కరీంనగర్ లో మోడల్ రోడ్లను నిర్మిస్తాం. స్కై వాక్ లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి లను నిర్మిస్తాం, నాన్ మోటరైజ్డ్ ట్రాన్స్ పోర్ట్ (మోటార్, ఇంధనం ఉపయోగించే రవాణా వాహనాలు) వాహనాలను అందుబాటులోకి తీసుకొస్తాం. కరీంనగర్ శివారు ప్రాంతాల్లోని గల్లీగల్లీలో సీసీ రోడ్లను నిర్మిస్తాం. అభివృద్ధిలో తెలంగాణలోనే కరీంనగర్ ను ఆదర్శంగా తీర్చిదిద్దడంతోపాటు సుందర నగరంగా మార్చబోతున్నాం. ఈ సందర్భంగా మీ అందరినీ కోరేదొక్కటే. ఎన్నికల వరకే రాజకీయాలు. ఎన్నికల తరువాత అభివృద్ధే ముఖ్యం. నాకు భేషజాల్లేవు. రాజకీయ తారతమ్యాలు లేవు. అందరం కలిసికట్టుగా పనిచేస్తూ ప్రజల ఆకాంక్షలను నెరవేరుద్దాం. అభివృద్ధి విషయంలో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తా తెలిపారు.

జాతీయ స్థాయి వుషు పోటీలకు ఎంపికైన వేదిర యువకుడు



రామడుగు, ప్రభతవార్త : రామడుగు మండలంలోని వేదిర గ్రామానికి చెందిన యువ క్రీడాకారుడు ఎం.డి. మన్సూర్ జాతీయ స్థాయి వుషు క్రీడా పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 28 నుంచి నవంబర్ 2 వరకు తమిళనాడు రాష్ట్రంలో జరగనున్న పోటీల్లో ఆయన పాల్గొననున్నాడు. మన్సూర్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల వేదిర గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మన్సూర్ క్రీడల్లో అద్భుత ప్రతిభ కనబరిచి విజయం సాధించి గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మన్సూర్ తల్లిదండ్రులు ఎం.డి. షాన్‌పాషా, రజియాతో పాటు గ్రామ సర్పంచ్ గ్రామ ప్రజలు ఆయనకు అభినందనలు తెలియజేశారు. జాతీయ స్థాయిలో విజయం సాధించి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఫుట్‌బాల్‌లో సత్తా చాటిన పెద్దపల్లి విద్యార్థి

అక్టోబర్ 29 నుంచి రాష్ట్ర స్థాయి అండర్14 పోటీలు



పెద్దపల్లి, ప్రభాతవార్త: పెద్దపల్లి ఇండియా మిషన్ హై స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి కె. ప్రవీణ్ కుమార్ తన క్రీడా ప్రతిభతో రాష్ట్ర స్థాయి అండర్14 బాలుర ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు అర్హత సాధించాడు. ఈ విషయాన్ని పాఠశాల కరెస్పాండెంట్ కె. ధనుంజయ రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 4న గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన ప్రవీణ్ కుమార్ జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. అక్టోబర్ 29, 30, 31 తేదీల్లో మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కండ్లకోయలోని సన్‌ఫ్లవర్ వేదిక్ స్కూల్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి టోర్నీలో ఈ జట్టు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ప్రాతినిధ్యం వహించనుంది. విద్యార్థి సాధించిన విజయంపై కరెస్పాండెంట్ కె. ధనుంజయ రెడ్డి, ప్రిన్సిపాల్ టి. జయరాజ్, వ్యాయామ ఉపాధ్యాయుడు కె. అశోక్, పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా ప్రతిభ చాటి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

త్రోబాల్ అభివృద్ధికి కృషి చేస్తాం

పెద్దపల్లి జిల్లా అధ్యక్షురాలిగా మాటేటి కృష్ణప్రియ

నియామకంప్రధాన కార్యదర్శిగా బొల్లి మోనికకు బాధ్యతలు

పెద్దపల్లి, ప్రభాతవార్త: పెద్దపల్లి జిల్లాలో త్రోబాల్ క్రీడను మరింత అభివృద్ధి చేసి, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తామని నూతనంగా నియమితులైన అసోసియేషన్ బాధ్యులు తెలిపారు. జిల్లా అధ్యక్షురాలిగా మాటేటి కృష్ణప్రియ, ప్రధాన కార్యదర్శిగా బొల్లి మోనికను నియమిస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. తమపై విశ్వాసం ఉంచి కీలక పదవులు కేటాయించిన రాష్ట్ర అసోసియేషన్ ప్రతినిధులకు వారు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో త్రోబాల్ క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తూ, క్రీడాభివృద్ధి కోసం బాధ్యతాయుతంగా పనిచేస్తామని కృష్ణప్రియ, మోనిక స్పష్టం చేశారు.





పోలీస్ అమరవీరుల సంస్మరణలో భాగంగా విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పోలీస్ అమరవీరుల సంస్మరణలో(పోలీస్ ఫ్లాగ్ డే) భాగంగా విద్యార్థిని విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా పోలీస్ శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలపై, పోలీస్ శాఖ పనితీరు, వైర్లెస్ సెట్ ద్వారా మాట్లాడే విధానం, పోలీసు లాకప్, ఎఫ్ఐఆర్ రిజిస్ట్రేషన్ విధానం, సీసీ కెమెరాల పనితీరు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ చేసే విధానం, డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల జరిగే నష్టాలు, డయల్ 112 సేవలు, రిసెప్షనిస్ట్ పనితీరు, 24 గంటలకు ప్రజలకు అందుబాటులో ఉండే డిపార్ట్మెంట్ పోలీస్ డిపార్ట్మెంట్ అని, పాత నేరస్తులను గుర్తుపట్టడానికి ఫింగర్ ప్రింట్ ద్వారా గుర్తించడం లాంటి వివిధ అంశాలపై ,పోలీసు ఆయుధాల పనితీరు, సంఘవిద్రోహ శక్తుల చేతిలో చనిపోయిన పోలీస్ అమరవీరుల గురించి, భరోసా సెంటర్, షి టీమ్ పోలీసులు, ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం విద్యార్థులకు అవగాహన కల్పించాలనే ఉదేశ్యంతో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది .విద్యార్థులు విద్యతో సమాజంలో జరుగుతున్న పరిణామాల పై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్ అంటే ఏమిటి, అది ప్రజలకు శాంతి భద్రతల విషయంలో ఏ విధంగా ఉపయోగపడుతుంది, దాని పని విధానం ఏవిధంగా ఉంటుందో తెలుసుకోవాల్సిన అవసరం ఉందని పోలీస్ అధికారులు తెలిపారు.ఈకార్యక్రమంలో వివిధ పోలీస్ స్టేషన్ లో ఎస్సైలు,పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా సమన్వయ కమిటీ సమావేశం

పలు న్యాయ, పరిపాలనా అంశాలపై సమీక్ష

కోర్టు కాంప్లెక్స్‌కు భూమి అప్పగింత, కొత్త కోర్టులకు భవనాల కేటాయింపు, పెండింగ్ కేసులకు సంబంధించిన నివేదికలపై చర్చ



జగిత్యాల, బ్యూరో ప్రభాత వార్త: జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి. రత్న పద్మావతి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, జిల్లాలోని వివిధ న్యాయస్థానాల న్యాయమూర్తులు పాల్గొన్నారు. న్యాయ స్థానాలకు సంబంధించిన పరిపాలనా అంశాలు,ఎగ్జిక్యూషన్ పిటిషన్ల సత్వర పరిష్కారం, సంబంధిత శాఖల నుంచి అందాల్సిన నివేదికలు, శాఖల మధ్య సమన్వయం తదితర అంశాలను సమావేశంలో సమీక్షించారు. జగిత్యాలలో 10+2 కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి కేటాయించిన భూమిని జిల్లా న్యాయ స్థానానికి భౌతికంగా అప్పగించే అంశంపై చర్చించారు. ఇందుకు సంబంధించి పూర్తి చేయాల్సిన లాంఛనాలు, భూమి స్వాధీన అప్పగింతకు అవసరమైన రికార్డులు, తదుపరి చర్యలను పరిశీలించారు.భూసేకరణ పరిహారానికి సంబంధించిన ఎల్.ఏ.ఓ.పీ. కేసుల ఎగ్జిక్యూషన్ పిటిషన్లలో పరిహార సొమ్ము జమ అంశాన్ని సమీక్షించారు. ఆయా కేసుల ప్రస్తుత స్థితి, పెండింగ్ అంశాలు, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల ద్వారా చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. జిల్లాకు నూతనంగా మంజూరైన మూడు న్యాయ స్థానాల నిర్వహణకు భవనాల కేటాయింపు అంశాన్ని పరిశీలించారు. న్యాయ స్థానాల కార్యకలాపాలకు అనువైన భవనాలు, అవసరమైన వసతులకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు.అలాగే, సి.ఆర్.పి.సి. సెక్షన్లు 82, 83 కింద ప్రక్రియ చేపట్టిన కేసులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న నివేదికలపై చర్చించారు. సమావేశానికి సమర్పించిన పది కేసుల జాబితాను పరిశీలించి, సంబంధిత తహసీల్దార్ కార్యాలయాల నుంచి న్యాయ స్థానాలకు అందాల్సిన నివేదికలు, వాటి ప్రస్తుత స్థితిని సమీక్షించారు. ఈ అంశాల్లో పోలీసు, రెవెన్యూ శాఖల మధ్య అవసరమైన సమన్వయం పై చర్చించారు. జిల్లా న్యాయస్థానం నుంచి పంపిన అధికారిక లేఖలపై స్పందన, పెండింగ్ ఉత్తర ప్రత్యుత్తరాలు, సంబంధిత అంశాలపై తీసుకున్న చర్యలను కూడా సమీక్షించారు. న్యాయస్థానాలకు అవసరమైన సమాచారం, నివేదికల సమర్పణలో జాప్యాన్ని తగ్గించడం, పరిపాలనా అంశాల పరిష్కారానికి సమన్వయంతో సాగడంపై చర్చించారు.

కమిషనర్ కు సీనియర్ సిటిజెన్స్ సమస్యలు

జగిత్యాల టౌన్, ప్రభాత వార్త:

సీనియర్ సిటిజెన్స్ ఎదుర్కొంటున్న సమస్యలను నూతన చీఫ్ కమిషనర్ గా పదవీ భాద్యతలు స్వీకరించిన జస్టిస్ ఈ. తిరుమల దేవిని జగిత్యాల జిల్లా సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా ప్రతినిధులు కలిసి పుష్పగుచ్చాలు అందించి స్వాగతించి శుభాకాంక్షలు తెలిపారు.మంగళవారం హైదరాబాద్ లోని కమిషనర్ కార్యాలయంలో కలిసిన హరి అశోక్ కుమార్ జిల్లాల్లో ప్రభుత్వ ఉద్యోగుల సంరక్షణ చట్టం కింద నమోదు అయిన కేసుల సత్వర పరిష్కారంకు కలెక్టర్లకు తగు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. నిరాధరణకు గురవుతున్న వయో వృద్ధ తల్లి దండ్రులకు సేవలు అందిస్తున్న తమ అసోసియేషన్ కు జగిత్యాల ఆర్డీవో కార్యాలయం ఆవరణలో గత కలెక్టర్ ఒక కూలిపోయిన గది కేటాయించగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ సహకారం తో తాము 6 లక్షలు వెచ్చించి నిర్మించుకోగా, అర్బన్ తహసీల్దార్ దౌర్జన్యంగా ఖాళీ చేయించిన విషయాన్ని, మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు తమ అసోసియేషన్ కు దరూర్ క్యాంపు లో ప్రభుత్వ స్థలం కేటాయింపునకు ఆదేశాలు ఇచ్చి మూడు మాసాలు కావస్తున్నా ఉత్తర్వులు జారీ చేయని విషయాలను కమిషనర్ దృష్టికి తెచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. సి. హన్మంత్ రెడ్డి, జిల్లా కార్యదర్శి గౌరి శెట్టి విశ్వ నాథము, ఉపాధ్యక్షులు బొల్లం విజయ్, పూసాల అశోక్ రావు,ఎం. డి. యాకూబ్, వెల్ ముల ప్రకాష్ రావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి మార్కండేయ సేవాసమితి రూ.20 వేల సాయం

జగిత్యాల అర్బన్ ప్రభాత వార్త‘



‘ఓదార్చే మాటల కన్నా సహాయం చేసే చేతులే మిన్న“ అనే స్ఫూర్తితో శ్రీ భక్త మార్కండేయ యువజన సేవాసమితి సమాజ సేవలో ముందుం టోందని సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం అన్నారు. జిల్లా కేంద్రానికి చెందిన సామాన్య కుటుంబానికి చెందిన భోగ సంతోష్ కవిత దంపతుల కుమారుడు చిరంజీవి విష్ణువర్ధన్ ఆదిలాబాద్ రిమ్స్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించారు. ఈ సందర్భంగా సేవాసమితి ఆధ్వర్యంలో ఆయనకు చదువు నిమిత్తం రూ.20,000 ఆర్థిక సాయం అందజేసి అభినందించారు. భవిష్యత్తులో మంచి వైద్యుడిగా పేదలకు సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి నాయకులు ఆకుబత్తిని శ్రీనివాస్, కొక్కుల సుదర్శన్, జోగ మల్లేశం, పద్మశాలి సేవాసమితి కన్వీనర్ బాలే చంద్రశేఖర్, కౌన్సిలర్ మానపురి పవిత్రమహేష్, చెట్టిపల్లి సుధాకర్, వొల్లాల గంగాధర్, శిరపురం జితేందర్, ఎలిగేటి నరసయ్య, కస్తూరి రాజన్న తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ వ్యక్తి ఆత్మహత్య

కొడిమ్యాల, ప్రభాతవార్త:



జగిత్యాల జిల్లా నాచుపల్లి గ్రామానికి చెందిన కొలకాని హనుమండ్లు (55) క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు కొడిమ్యాల పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే నాచుపల్లి గ్రామానికి చెందిన కొలకాని హనుమండ్లు తండ్రి మల్లయ్య గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన ఆయన ఈ నెల 25వ తేదీ సాయంత్రం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. మరుసటి రోజు (అక్టోబర్ 26న) నామపల్లి పరిసర ప్రాంతాల్లో ఓ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై మృతుడి భార్య కొలకాని రాధా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

భూముల రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్..



జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త: జిల్లా లో జరుగుతున్న రీసర్వే పనులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కోరుట్ల మండలం ధర్మారం గ్రామంలో నిర్వహిస్తున్న భూముల రీసర్వే ప్రక్రియను మంగళవారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనుల పురోగతిని, సర్వే నిర్వహిస్తున్న విధానాన్ని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భూముల రీసర్వే ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. సర్వే సమయంలో భూముల హద్దులు, భూ యజమానుల వివరాలు, అందుబాటులో ఉన్న భూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించి, భూములకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు.రీసర్వే ద్వారా భూముల వివరాలు, సరిహద్దులకు సంబంధించిన అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డుల్లో ఉన్న వివరాలతో సరిపోల్చుకోవాలని అధికారులకు తెలిపారు. సర్వే నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి, నిబంధనల ప్రకారం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రీసర్వే పనులను సమన్వయంతో నిర్వహిస్తూ, ప్రక్రియ సజావుగా జరిగేలా సంబంధిత రెవెన్యూ, సర్వే అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు.గ్రామస్థాయిలో భూములకు సంబంధించిన వివరాల పరిశీలనలో పారదర్శకత పాటిస్తూ, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రీసర్వే ప్రక్రియను నిర్వహించాలని తెలిపారు. సర్వే పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్దేశించిన విధానాల ప్రకారం పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, తహసీల్దార్ మరియు సర్వే అధికారులు పాల్గొన్నారు.

మ్యాజిక్ షోలతో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

సారంగాపూర్‌లో టీజీబీ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం

సారంగాపూర్ ప్రభాత వార్త : మండల కేంద్రంలోని కళ్యాణ మండపంలో టీజీబీ మేనేజర్ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాబార్డ్ డీడీఎం దిలీప్ చంద్ర, సీనియర్ బిజినెస్ మేనేజర్ లక్ష్మీనారాయణ రెడ్డి, ఫైనాన్షియల్ మేనేజర్ ప్రవీణ్, స్థానిక సర్పంచ్ చేకుట అరుణశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కళాజాత బృందం సభ్యులు మ్యాజిక్ షోల ద్వారా బ్యాంకింగ్ సేవలు, ఆర్థిక లావాదేవీలు, ఆర్థిక అక్షరాస్యతకు సంబంధించిన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సులభంగా అర్థమయ్యే రీతిలో ప్రదర్శనలు నిర్వహిస్తూ బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు.అనంతరం నాబార్డ్ డీడీఎం, బ్యాంకు అధికారులు మాట్లాడుతూ, ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, అనుమానాస్పద లింకులు, మోసపూరిత సందేశాల పట్ల జాగ్రత్త వహించాలని తెలిపారు. ముఖ్యంగా బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్, ఓటీపీ వంటి రహస్య సమాచారాన్ని ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు. సైబర్ మోసాలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా ఆర్థిక నష్టాలను నివారించవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీజీబీ బ్యాంకు సిబ్బంది, సీసీ ప్రభాకర్, ఫైనాన్షియల్ లిటరసీ అధికారులు విజయ్ కుమార్, సౌజన్యతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

